తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

బుధవారం 12.08.2026 | సంపుటి : 13 | సంచిక : 23 | పేజీలు : 12 | వెల : రూ. 4/-



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్

65 అంతస్తుల్లో 450 ఫ్లాట్లతో భారీ నిర్మాణం

ఆకాశహర్మ్యాల భూమిపూజకు హాజరుకానున్న ట్రంప్ కుటుంబ సభ్యులు



2లో..

## ట్రాఫిక్‌కు తగ్గట్టుగా కొత్త కోచ్‌లు

# కొనండి



### ఒర్జినల్ సిటీకి మెట్రో వేగంగా విస్తరించాలి

- వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి
- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి):

హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్‌-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవా



లని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## అట్టహాసంగా గ్లోబల్ సమ్మిట్

- అంతర్జాతీయ దృష్టి ఆకర్షించేలా కార్యక్రమం
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

## యంగ్ ఇండియా పాఠశాలలతో ప్రతి విద్యార్థికీ ప్రపంచస్థాయి విద్య

- ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్

డిసెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయండి: సీఎం రేవంత్

వార్త 2 లో



## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

### ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్ర మంలో ముఖ్యమంత్రి ఈ పక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి

మిగతా 2లో..

## ఇకపై మండల స్థాయిలో ప్రజావాణి

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

## జనగణమన తరహాలో వందేమాతరం

చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

2లో..

## 'కేరళ' ఇకనుంచి 'కేరళం'

లోక్‌సభలో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం

## 'నీట్' రద్దు చేయాలి

### అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వం తీర్మానం



చెన్నై(జనంసాక్షి): వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను తొలినుంచీ తమిళనాడు వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్య శాఖ మంత్రి కె.అరుణ్‌రాజ్ మంగళవారం ఈ తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీనికి ప్రధాన

మిగతా 2లో..

## రేవంత్ సోదరుల బండారం త్వరలోనే బయటపెడతాం

- చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు
- ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారు: కేటీఆర్



హైదరాబాద్,ఆగస్ట్11 (జనంసాక్షి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వా హక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టు కున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు

మిగతా 2లో..

## నిబంధనల మేరకే 'టెసరాట్'కు భూ కేటాయింపులు

### ఆ సంస్థతో సీఎం సోదరుడికి సంబంధం లేదు: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం సోదరులకు భూ కేటాయింపులు చేశారంటూ ఆయన అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎకరం రూ. 90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా

మిగతా 2లో..



## జీనోమ్ వ్యాలీలో 'యామ్జైన్' పరిశోధన కేంద్రం

మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ

వార్త 2 లో

## నిషేధిత భూములపై ఆందోళన చెందొద్దు

**చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం**

- యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన

మిగతా 2లో..

## కాంట్రాక్టు బిల్లులిస్తామంటే కండువా కప్పకున్నా..

- అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోలేను
- పోచారం కీలక వ్యాఖ్యలు




బీర్కూరు(జనంసాక్షి): నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ వద్దకు వెళ్లి కండువా కప్పుకొన్నట్లు బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. సగం నిధులు

మిగతా 2లో..

# మృత్యుశకటం

### ఆటోను ట్యాంకర్ ఢీకొని ఐదుగురు కూలీల మృతి

- సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మరో ఏడుగురికి తీవ్రగాయాలు
- మరో ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- ప్రమాదంపై సీఎం రేవంత్ తీవ్రదిగ్భ్రాంతి





మొగుడంపల్లి(జనంసాక్షి):సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జహీరాబాద్ మండలం ఎత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరు కొని దర్యాప్తు చేపట్టారు.సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో

మిగతా 2లో..

## మన్మోహన్ ప్రభావశీలి

- కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు
- మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక

న్యూఢిల్లీ(జనంసాక్షి): కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచు కుంటుం దని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో

మిగతా 2లో..




## కొనసాగుతున్న ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపిల పరస్పర నినాదాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

మిగతా 2లో..

## అమిత్ షా పిరికివాడు

అందుకే లోక్‌సభకు రాలేదు: జైరామ్ రమేశ్

2లో..

## యూపిఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు:నిర్మల

## 'మూన్ మిషన్' కోసం మాతో చేతులు కలపండి

ఇస్రోకు నాసా ఆహ్వానం

## 'మిస్సింగ్‌కేసుల్లో తక్షణమే స్పందించాలి

- పిల్లలు.. పెద్దలు అని తేడా ఉండకూడదు
- రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సూచన

వివరాలు లోపలి పేజీల్లో..

## నిబంధనల మేరకే 'టెసరాట్'కు భూ కేటాయింపులు

జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్ట వచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏ ది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరిం త పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజ మో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరిం చాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అను గుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయం లో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించా లన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా అని అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాటని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

### జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి):గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్

హైదరాబాద్(జనంసాక్షి): భాగ్యనగరంలో మరో అతిపెద్ద రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ ప్రారంభం కాబోతోంది. కోకాపేటలోని గోల్డెన్ మైల్ రోడ్డులో ట్రంప్ టవర్స్ ఏర్పాటు కానున్నాయి. ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా వీటి నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నాయి. మొత్తం 65 అంతస్తులతో రెండు టవర్ల నిర్మాణం జరగనుంది. అతి ఖరీదైన 450 ఫ్లాట్లు ఉండనున్నాయి. ట్రంప్ టవర్స్‌కు ఇప్పటికే రెరా అనుమతులు ఇచ్చింది. ఈ టవర్ల ఎత్తు 240 మీటర్లు ఉంటుంది. ఇవి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన టవర్లుగానూ, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన ట్రంప్ టవర్లుగానూ నిలవనున్నాయి. దీనికి సంబంధించి త్వరలో జరిగే భూమి పూజకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు వెల్లడించాయి. ముంబయికి చెందిన ట్రిబెకా డెవలపర్ ట్రంప్ బ్రాండ్‌తో నిర్మాణాలు చేపడుతోంది. ట్రంప్ టవర్స్ పేరుతో దేశంలో ఇప్పటికే 8 ప్రాజెక్టులు ప్రకటించింది. పుణె, ముంబయి, కోల్‌కతా, గురుగ్రామ్‌లో నాలుగు ప్రాజెక్టులను పూర్తి చేసింది. దక్షిణ భారతంలో తొలిసారిగా హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్‌ను నిర్మించబోతోంది.

## జనగణమన తరహాలో వందేమాతరం

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది.÷రిత్త చట్టం ప్రకారం 'వందేమాతరం' గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

## 'కేరళ' ఇకనుంచి 'కేరళం'

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. కాగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

## రేవంత్ సోదరుల బండారం త్వరలోనే బయటపెడతాం

చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపిం చారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు.

# అట్టహాసంగా గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి):తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు.

### యంగ్ ఇండియా పాఠశాలలతో ప్రతి విద్యార్థికీ ప్రపంచస్థాయి విద్య

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

### ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో ఖేలో ఇండియా యూత గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ లోని స్టేడియంలలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్ తో పాటు జాతీయస్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్ కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎండీ సోనీబాల దేవి పాల్గొన్నారు.

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. ÷ాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్దిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్దిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్దిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు

## నీట్ రద్దు చేయాలి

విపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకే మద్దతు తెలిపాయి. టీవీకేకు మిత్రపక్షాల నుంచి ఎలాగూ మద్దతు ఉంది. ఒక్క భాజపా మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆరోగ్య మంత్రి అరుణ్‌రాజ్ మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలి. ఈ ప్రవేశ పరీక్షవల్ల విద్యార్థుల దృష్టి కోచింగ్ సెంటర్ల వైపు మళ్లింది. ఫీజులు భారీగా వసూలు చేసే కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని, సామాజికంగా-ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి" అని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల హక్కులకు ఈ పరీక్ష వ్యతిరేకం అనే విషయాన్ని తమిళనాడులోని ప్రతి ప్రభుత్వం వాదిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం ఉండాలని విజయ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డీఎంకే ఇదే ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. నీట్ పేపర్ లీక్ అంశాన్ని కూడా తమిళనాడు ప్రభుత్వం తీర్మానంలో ప్రస్తావించింది (ఔఇఖ ఖీనీలి). విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ పరీక్ష ఒత్తిడి కారణమని పేర్కొంది. నీట్ రద్దుతోనే వాటికి ముగింపు వస్తుందని అభిప్రాయపడింది.

## మృత్యుశకటం

ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.కాగా సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మన్మోహన్ ప్రభావశీలి

పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు. మరికొందరిని బీజేపీలో కలిపేసుకున్నారు. మరికొన్ని అసాధారణ సందర్భాల్లో కొందరికి మంత్రి పదువులు కూడా దక్కాయి' అని సోనియా గాంధీ విమర్శించారు.

## ఇకపై మండల స్థాయిలో ప్రజావాణి

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## కాంట్రాక్టు బిల్లులిస్తామంటే కండువా కప్పుకున్నా..

మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు."బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల గుత్తేదారులు పనులు ఆపేశారు. నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ నిర్వహించారు. సమావేశంలో సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించా. సీఎం చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి నిధులు మంజూరు చేయలేదు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోలేను"అని పోచారం వ్యాఖ్యానించారు.

## 'మిస్సింగ్‌కేసుల్లో తక్షణమే స్పందించాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఒక వ్యక్తి తప్పిపోయారని సమాచారం అందగానే పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసు, లింగంతో సంబంధం లేకుండా అదృశ్యమైన వ్యక్తి విషయంలో తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పింది. తాము గతంలో ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్న 'పర్సన్' అనే పదం కేవలం పిల్లలకే పరిమితం కాదని తెలిపింది. తమ ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ధిక్కార చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది."పర్సన్ అనే పదం కేవలం పిల్లలకే వర్తిస్తుందని, పెద్దలకు కాదని కొన్ని రాష్ట్రాలు భావిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అది తెలిసి తీవ్రగ్భ్రాంతికి గురయ్యాం. అది ఒక ఉద్దేశపూర్వక భ్రమ అని మేం భావిస్తున్నాం. మా గత ఉత్తర్వుల్లో ప్రస్తావించిన అంశాలు స్పష్టంగా ఉన్నాయి. 'వ్యక్తి' అనే పదానికి వయసు, లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరని అర్థం" అని సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది.తప్పిపోయిన వ్యక్తిని గుర్తించడానికి కావాల్సిన బృందాన్ని వెంటనే రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి మిస్ అయిన తర్వాత తొలి గంటలు కీలకమని, ఆ సమయంలోనే పోలీసులు తక్షణం స్పందిస్తే.. వారిని గుర్తించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. అలాగే ఆ వ్యక్తిని కాపాడిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా కుటుంబ సభ్యులకు అప్పగించాలని సూచించింది.

# నిషేధిత భూములపై ఆందోళన చెందొద్దు

సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రతిష్టంభన

ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

## అమిత్ షా పిరికివాడు

న్యూఢిల్లీ(జనంసాక్షి):విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

## 'మూన్ మిషన్' కోసం మాతో చేతులు కలపండి

వాషింగ్టన్(జనంసాక్షి):అంతరిక్ష పరిశోధనల్లో దూసుకెళ్తున్న ఇస్రో చంద్రుడిపై కీలక పరిశోధనలు చేస్తున్న సంగతి విషయం తెలిసిందే. అమెరికా కూడా.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2032 నాటికి శాశ్వత మానవ స్థావరం ఏర్పాటు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తలపెట్టిన మూన్ బేస్ మిషన్ లో భాగం కావాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థను నాసా ఆహ్వానించింది. ఇండియా-యూఎస్ సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలను మరింత బలోపేతం చేసుకోవడం, శాస్త్రీయ సమాచారాన్ని పంచుకోవడం, సహకారం, వీటికి సంబంధించిన చర్చలను ముమ్మరం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి.గతేడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఇరు దేశాలు సాధారణ, వాణిజ్య అంతరిక్ష పరిశోధనల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపైనా ఇరు పక్షాలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, అమెరికా రాయబారి సెర్గియో గోర్‌లు మాట్లాడుతూ.. ద్వైపాక్షిక అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం, దాని ప్రాముఖ్యతను ప్రస్తావించారు.

## యూపిఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

న్యూఢిల్లీ(జనంసాక్షి): రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూపీఐల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు.

# డిమాండ్లను పరిష్కరించండి

- పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం ఛైర్మన్ తర్కరేతో డీలర్స్ సమావేశం
- పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి



న్యూఢిల్లీ (జనంసాక్షి) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా కోరుతూ యునైటెడ్ పెట్రోలియం డీలర్స్ అసోసియే షన్ ప్రతినిధి బృందం పార్లమెంటరీ స్థాయీ సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరేకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావుల ఆధ్వర్యాన అసోసియేషన్ తెలంగాణ శాఖ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ తదితరులు మంగళవారం సాయంత్రం ఢిల్లీలో తర్కరేతో సమావేశమయ్యారు. తర్కరే నివాసంలో సుమారు గంటసేపు జరిగిన ఈ సమావేశంలో 8 ఏళ్లుగా తమ డీలర్స్ మార్జిన్ పెరుగుపోవడాన్ని, పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరేకు అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ బృందంలో గుజరాత్, పశ్చిమ బెంగాల్,కేరళ, బీహార్, తమిళనాడు, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు.

# మర్డర్ ఫర్ గెయిన్ నిందితుడిపై పీడీ యాక్ట్

**రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య తన్నరీజా రంజన్ హత్య కేసులో చర్యలు**

**నేపాల్ గ్యాంగ్ సభ్యుడు సునీల్ బహదూర్ అరెస్ట్.. మరో ఎనిమిది మంది పరారీ**



అమీర్‌పేట (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ పరిధిలో సంచలనం సృష్టించిన తన్నరీజా రంజన్ హత్య కేసులో నిందితుడైన నేపాల్‌కు చెందిన సునీల్ బహదూర్ ఆజూజీ ఏ సునీల్ పరివార్ (29)పై హైదరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తన్నరీజా రంజన్ (62)ను హత్య చేసి, నగలు, విలువైన వస్తువులు దోచుకున్న కేసులో సునీల్ నిందితుడిగా ఉన్నాడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 307/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 103(1), 309(2), 317(3) కింద కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. సునీల్ తన సహచరులతో కలిసి కుట్ర పన్ని తన్నరీజా రంజన్ నివాసంలోకి ప్రవేశించి, ఆమెను నిర్బంధించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో సునీల్‌ను మే 22న అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. సునీల్‌పై గతంలో గుజరాత్‌లోని జామ్‌నగర్, మహారాష్ట్రలోని నైగావ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. హత్య కేసులో వ్యవస్థీకృత గ్యాంగ్ ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.

**మరో 8 మంది పరారీ**

ఈ కేసులో మరో ఎనిమిది మంది నేపాల్ పౌరులు పరారీలో ఉన్నారు. వికాస్, కల్పనా ఏ ధర్మ, సృజన్ షాహి ఏ సురేశ్ షాహి, దినేశ్ షాహి ఏ గణేశ్ బికా, శంకర్ లామా ఏ కాంచా, నేత్ర షాహి ఏ ప్రేమ్ షాహి ఏ నరేశ్ షాహి, గణేశ్ షాహి, దిలీప్ బిశ్వకర్మ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారే అలవాటైన, వ్యవస్థీకృత నేరగాళ్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైదరాబాద్ పోలీసులు తెలిపారు.

# త్వరలో రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా

హైదరాబాద్ (జనంసాక్షి) : త్వరలో రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. కమిటీ తరుపున ప్రొ.జి.లక్ష్మణ్ (సీఎల్‌సీ), వి.సంధ్య (పీవోడబ్ల్యూ), డాక్టర్.ఉస్మాన్ (ఏపీసీఆర్), రవి నర్ల (ఎఫ్ఆర్ఎస్ఎఫ్), కె.రవి చందర్ (ఎఫ్ఏఆర్), ఏ.దశరథ (సీఆర్‌పీపీ), ఎన్.నారాయణ రావు (సీఎల్‌సీ), భరద్వాజ (ఎఫ్ఆర్ఎస్ఎఫ్) మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ధర్నా పోస్టర్‌ను నేడు విడుదల చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు కలిసి "రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక (యూఎఫ్ఆర్‌పీపీ)' ను ఏర్పాటు చేశారని, మావోయిస్టు సంస్థ అంతమైందని, దాని కార్యకలాపాలు ఆగిపోయాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే గతంలో వారికి సహకరించారని, వారితో కలిసి పనిచేశారనే కారణాలతో దేశంలో, రాష్ట్రంలో వందలాదిగా ప్రజలు...ప్రత్యేకించి ఆదివాసులు వివిధ జైళ్లలో ఖైదీలుగా మగ్గుతున్నారు. మరోవైపు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలపై, అలాగే లాయర్లు, టీచర్లు, జర్నలిస్టులపై టెర్రరిస్టు చట్టం ఉపా కింద అనేకమందిపై అక్రమ కేసులు కొనసాగుతున్నవని తెలిపారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఖైదీలందరిని విడుదల చేయాలని, వివిధ సెక్షన్ల ప్రజానీకం మీద అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసులను ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతూ... వివిధ రూపాలలో ఉద్యమ కార్యాచరణను చేపట్టామని తెలిపారు. ఈ పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రొ.జి. హరగోపాల్ (యూఎఫ్ఆర్‌పీపీ కన్వీనర్), ప్రొ. యం. కోదండరాం, ప్రొ.అన్వర్ ఖాన్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొంటారని తెలిపారు.

# రాహుల్ ఫోటోపై దుమారం

- గిరిరాజ్ పోస్ట్‌పై సర్వత్రా చర్చ



న్యూఢిల్లీ, ఆగస్ట్11 (జనంసాక్షి) : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సంబంధించిన ఓ ఫొటో ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓ మహిళ, చిన్నారితో కలిసి పడవలో ఉన్న రాహుల్ గాంధీ ఫొటోను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈ ఫొటో ఎక్కడ తీశారు? ఎప్పుడు తీశారు? రాహుల్‌తో ఉన్న మహిళ, చిన్నారి ఎవరు?' అంటూ ఆయన ప్రశ్నలు సంధించారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై బీజేపీ గతంలోనూ విమర్శలు చేసింది. జూన్ 22 నుంచి జులై 13 వరకు రాహుల్ చేపట్టిన విదేశీ పర్యటనపైనా బీజేపీ పలు ప్రశ్నలు లేవనెత్తింది. అయితే తాజాగా గిరిరాజ్ సింగ్ పంచుకున్న ఈ ఫొటో అదే పర్యటనకు సంబంధించినదా అనే విషయం స్పష్టంగా తెలియలేదు. కాగా, వైరల్ అవుతున్న ఈ ఫొటోపై రాజకీయ చర్చ మొదలైన తర్వాత కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. రాహుల్ గాంధీతో ఫొటోలో కనిపిస్తున్న మహిళ, బాలుడు రాహుల్ గాంధీ స్నేహితుడి భార్య, కుమారుడని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనటే తెలిపారు. కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లిన సమయంలో ఈ ఫొటో తీసినట్లు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ స్నేహితుడు మాత్రం ఆ ఫొటోలో లేరని స్పష్టం చేశారు. ఇక, ఈ ఫొటో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని లేక్ రే రాబర్ట్స్ వద్ద తీసినదని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సోషల్ మీడియా బాధ్యతలు నిర్వహిస్తున్న అవి దండియా తెలిపారు.

# గ్రామీణ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

- 20 లక్షల 50 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్
- రైతుల నుంచి నేరుగా కూరగాయల సేకరణకు కార్యాచరణ
- మహిళా రైతు సంఘాలకు ఆర్థిక బలోపేతం
- రైతులకు స్థిరమైన మార్కెట్ కల్పించడమే లక్ష్యం
- ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి
- రాష్ట్రంలో కూరగాయల సాగుపై ఉన్నత స్థాయి సమావేశం



హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) : గ్రామీణ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంతో పాటు, స్థానిక రైతులకు స్థిరమైన మార్కెట్ కల్పించడం, గ్రామీణ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉన్నతస్థాయి సమావేశం మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించారు. నిపుణుల కమిటీ రెండవ సమావేశానికి కమిటీ చైర్మన్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అధ్యక్షత వహించారు. వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ పేదరిక నిర్మూలన, విద్యాశాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామీణ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న ఆహార కార్యక్రమానికి అవసరమైన కూరగాయలను స్థానిక రైతుల నుంచి నేరుగా సేకరించే అంశంపై ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు హరేకృష్ణ మిషన్, మన్న ట్రస్ట్, అక్షయపాత్ర వంటి సంస్థల సహకారంతో కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని సమావేశంలో వివరించారు. ఈ సంస్థలకు అవసరమైన కూరగాయలను రైతుల నుంచి నేరుగా సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి రైతులకు మెరుగైన ధర కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.

గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారి నుంచి నేరుగా కూరగాయలను సేకరించి పాఠశాలల కోసం పనిచేస్తున్న సంస్థలకు సరఫరా చేసే విధానాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా కూరగాయలు పండించే రైతులకు స్థిరమైన మార్కెట్, మంచి ధర లభించడం, గ్రామీణ మహిళా సంఘాలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరగడం, పాఠశాల విద్యార్థులకు తాజా, నాణ్యమైన కూరగాయలతో కూడిన పోషకాహారం అందడం, ధార్మిక, సేవా సంస్థలకు నాణ్యమైన ముడి సరుకును నిరంతరాయంగా అందించడం వంటి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని సమావేశంలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 39 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా గ్రామీణ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసి అందిస్తున్న నేపథ్యంలో, ఆయా కిచెన్ల పరిధిలోని గ్రామాల్లో ఇప్పటికే కూరగాయలు సాగు చేస్తున్న రైతుల తో పాటుగా కొత్తగా కూరగాయల సాగు చేయాలనుకున్న గుర్తించాలని నిర్ణయించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను గుర్తించి, వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా మహిళా రైతులు, మహిళా సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

**ఈ నెల 17 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన**

ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కూరగాయలు సాగు చేస్తున్న రైతులు, మహిళా రైతులు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, సాగు సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, నీటి వసతి, మార్కెటింగ్, సేకరణ, ధర తదితర అంశాలపై వారి అవసరాలను తెలుసుకుని నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి సమన్వయంతో క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ వివరాలను ఈ నెల 22వ తేదీలోగా రాష్ట్రస్థాయికి పంపించాలని సమావేశంలో నిర్ణయించారు.

**22న నిపుణుల కమిటీ తదుపరి సమావేశం**

క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నెల 22వ తేదీన నిపుణుల కమిటీ మరోసారి సమావేశమై, రైతుల నుంచి నేరుగా కూరగాయల సేకరణ, మహిళా సంఘాల భాగస్వామ్యం, 39 సెంట్రలైజ్డ్ కిచెన్లకు సరఫరా వ్యవస్థ, రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయం తదితర అంశాలపై తదుపరి కార్యాచరణను ఖరారు చేయనుంది. సమావేశంలో వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, ప్రభుత్వ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ఐఏఎస్, వ్యవసాయ సంచాలకులు బి. గోపీ ఐఏఎస్, విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఐఏఎస్, రజిత, సీఓఓతో పాటు హరేకృష్ణ మిషన్, మన్న ఫౌండేషన్, అక్షయపాత్ర సంస్థల ప్రతినిధులు, వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

- 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు
- జిల్లా మానిటరింగ్ కమిటీలలో రైతులను భాగస్వాములను చేయాలి
- కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేయాలి
- సీసీఐ అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) : రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. పాస్ కిసాన్ యాప్ లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో చెరువులను అభివృద్ధి చేద్దాం.. రండి

- పలు సంస్థలకు ఎంఏయూడీ పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) : సామాజిక బాధ్యత కింద నగరంలోని చెరువులను అభివృద్ధి చేద్దామని మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి సంస్థ నగరంలోని పలు సంస్థలకు పిలుపునిచ్చింది. చెరువుల అభివృద్ధి, పునరుజ్జీవనంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్ ) భాగస్వామ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో హీూడఖణ, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎస్ఆర్ రౌండ్ టేబుల్ 2.0 కార్యక్రమంలో ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ గారు, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మాట్లాడారు. నగరంలోని చిన్న చెరువులను జూ= నిధుల ద్వారా అభివృద్ధి చేసేందుకు కార్పొరేట్ సంస్థలను ముందుకు రావాలని ఆహ్వానించారు. నగర పర్యావరణ సమతుల్యత, భవిష్యత్ నీటి అవసరాలు, వరదల నియంత్రణలో చెరువుల ప్రాధాన్యతను వివరించారు. హైడ్రా చేపట్టిన మొదటి దశ, రెండో దశ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. అలాగే మూడో దశలో చేపట్టనున్న చెరువుల అభివృద్ధి కార్యక్రమానికి కూడా ప్రభుత్వ ఆమోదం లభించినట్లు తెలిపారు. నగరంలోని చెరువులను మరింత అభివృద్ధి చేసి, వాటిని భవిష్యత్ తరాలకు సంరక్షించేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు కార్పొరేట్ సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సీఎస్ఆర్ ద్వారా చిన్న చెరువుల అభివృద్ధికి సంస్థలు ముందుకు వస్తే నగర పర్యావరణ పరిరక్షణతో పాటు సుస్థిర హైదరాబాద్ నిర్మాణానికి మరింత తోడ్పాటు అందుతుందని తెలిపారు.

# అబాకస్ కాంపిటీషన్లో అబాకస్ చాంప్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

- తమిళనాడు కోయంబత్తూర్ - 2026 నిర్వహించిన ఎగ్జామ్ లో విద్యార్థుల ఎంపిక



వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 11 (జనంసాక్షి): తమిళనాడు కోయంబత్తూర్ బి -స్పోర్ట్స్ చాంప్స్ అకాడమీ నిర్వహించిన ఆన్లైన్ ఛాంపియన్షిప్ పోటీలో గ్రేటర్ వరంగల్ కు చెందిన విద్యార్థులు పోటీలో ఎంపిక అయ్యారు. ఎంపికైన వారిలో డి.సాయి కీర్తన, డి. జాన్వి, ఎం. నిత్య ఆనంది, ఏం. అయాన్, వై. దేవాన్ష్, జి.షారోన్ ప్రశస్త, పి.సాయి అభిజ్ఞ, డి.సాన్వి భద్ర, డి. దక్షి, బి పూజిత, ఎ. హన్విక విజయం సాధించారు. శిక్షకులు ధోని.దివ్య, ధోని.అనిల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ విజయం సాధించారు. వీరిని అబాకస్ చాంప్స్ అకాడమీ రూపకర్తలు అయిన ధోని.దివ్య , ధోని.అనిల్ మరియు ట్రైనర్స్ బృందం వారిని అభినందించారు.

# సర్పంచ్ విధులకు హైకోర్టు బ్రేక్!

- ముకదంగూడ సర్పంచ్ ఎన్నికపై వివాదం...
- రీకౌంటింగ్ కోరిన ప్రత్యర్థి
- హైకోర్టును ఆశ్రయించడంతో తాత్కాలిక స్టే...



కెరమెరి, ఆగస్టు11 (జనంసాక్షి) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం ముకదంగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక వివాదం హైకోర్టు మెట్లు ఎక్కింది. ఎన్నికల సమయంలో తనకు అన్యాయం జరిగిందని, ఓట్ల లెక్కింపులో రీకౌంటింగ్‌కు అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ మనీషా విజయ్ రాథోడ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ముకదంగూడ సర్పంచ్ స్థానానికి విమలా బాయి, మనీషా రాథోడ్ పోటీ చేశారు. ఎన్నికల ఫలితాల్లో విమలాబాయి తన సమీప ప్రత్యర్థి మనీషా విజయ్ రాథోడ్‌పై కేవలం ఆరు ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఓట్ల లెక్కింపు సమయంలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ మనీషా విజయ్ రాథోడ్ రీకౌంటింగ్ నిర్వహించాలని అధికారులను కోరినప్పటికీ తన అభ్యర్థనను అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. పిటిషనర్ తరపు వాదనలను పరిశీలించిన అనంతరం, తదుపరి విచారణ జరిగే వరకు ప్రస్తుత సర్పంచ్ విమలాబాయి విధులకు హాజరు కాకుండా తాత్కాలిక స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఈ నెల 27 వరకు అమల్లో ఉండనుంది..

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 12 ఆగస్టు 2026

ఓటు ఉంటుందా? ఊడుతుందా?

# ప్రక్షాళన సరే.. పారదర్శకత ఏదిలి?

సంపాదకీయం

ప్రజాస్వామ్యానికి పునాది ఓటరు. ఓటరు లేకుండా ఎన్నికలు లేవు.. ఎన్నికలు లేకుండా ప్రభుత్వం లేదు. అందుకే ఓటరు జాబితా అనేది కేవలం పేర్ల సముదాయం కాదు – అది ప్రజాస్వామ్యానికి పునాది రాయి. ఆ పునాదిలోనే లొసుగులు బయటపడుతుంటే, భవనం ఎంత ఎత్తు కట్టినా అది సురక్షితమేనా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

నటుడు ప్రకాశ్ రాజ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఓటరు జాబితాల ప్రక్షాళన ప్రక్రియపై మరోసారి చర్చకు దారితీశాయి. బెంగళూరులో గల్లంతైన ఓట్లలో తన ఓటు కూడా ఉందని ఆయన పేర్కొంటూ, తాను అదే ప్రాంతంలో పుట్టి, పెరిగి, చదువుకుని, చివరకు అక్కడి నుంచే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ తన పేరు ఓటరు జాబితా నుంచి తొలగించబడటంపై ప్రశ్నించారు. ఒక సాధారణ పౌరుడి ఓటు తొలగించబడితే అతను దాన్ని ఎలా గుర్తించాలి? తిరిగి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఎవరిని సంప్రదించాలి? ఎలాంటి ఆధారాలు సమర్పించాలి? తొలగింపుకు అసలు కారణం ఏమిటో తెలుసుకునే హక్కు అతనికి ఎంతవరకు అందుబాటులో ఉంది? ఇవే ఇప్పుడు అసలు ప్రశ్నలు.

ఓటరు జాబితాల ప్రక్షాళన అవసరం లేదని ఎవరూ చెప్పలేరు. మరణించిన వ్యక్తుల పేర్లు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు జాబితాలో కొనసాగడం కూడా ఎన్నికల విశ్వసనీయతకు సమస్యే. అందువల్ల జాబితాలను ఎప్పటికప్పుడు సవరించడం ఎన్నికల వ్యవస్థలో సహజమైన, అవసరమైన ప్రక్రియ. అయితే ఇక్కడే అసలు సందేహం మొదలవుతుంది – ప్రక్షాళన అవసరంపై కాదు, ప్రక్షాళన జరిగే విధానంపై అనుమానాలు ఎందుకు వస్తున్నాయి?

ఒక ఓటరు పేరు తొలగించడానికి ఉపయోగించిన ప్రమాణాలు అందరికీ ఒకేలా వర్తిస్తున్నాయా? పేరు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు నిజంగా నోటీసు అందుతున్నదా? నోటీసు అందకపోతే దానికి బాధ్యత ఎవరిది? ఓటరు తన పేరు తొలగించబడిందని ముందుగానే తెలుసుకునే వ్యవస్థ ఉందా? అభ్యంతరం చెప్పేందుకు తగిన సమయం ఇస్తున్నారా? అభ్యంతరం వ్యక్తం చేసిన తర్వాత దానిని పరిశీలించే విధానం ఎంత పారదర్శకంగా ఉంది? ఇవన్నీ కేవలం రాజకీయ ప్రశ్నలు కావు. ఇవి ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించే ప్రాథమిక ప్రశ్నలు.

బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కూడా ఇదే తరహా ప్రశ్నలు, రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయని విపక్షాలు ఆరోపించగా, ఎన్నికల సంఘం మాత్రం జాబితాల శుద్ధీకరణలో భాగంగానే చర్యలు తీసుకుంటున్నామని వివరణ ఇచ్చింది. ఒకవైపు నకిలీ, డూప్లికేట్ పేర్లను తొలగించడం అవసరం. మరోవైపు నిజమైన ఓటరు పేరు పొరపాటున తొలగించబడకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత.

ఎందుకంటే నకిలీ ఓటు జాబితాలో ఉండటం ఒక సమస్య అయితే, అర్హుడైన పౌరుడి ఓటు జాబితా నుంచి తొలగిపోవడం మరో తీవ్రమైన సమస్య. మొదటి సమస్య ఎన్నికల వ్యవస్థను కలుషితం చేస్తుంది. రెండోది నేరుగా ఒక పౌరుడి ప్రజాస్వామ్య హక్కును దెబ్బతీస్తుంది. అందుకే తొలగింపు ప్రక్రియలో పొరపాట్లకు అవకాశం లేకుండా అత్యంత జాగ్రత్త అవసరం.

ప్రకాశ్ రాజ్ ఘటన నిజంగా ఎలా జరిగిందన్నది సంబంధిత అధికారుల వివరాలతోనే తేలాలి. ఒక వ్యక్తి చేసిన ఆరోపణను తుది సత్యంగా భావించడం ఎంత తప్పో, అలాంటి ఆరోపణను పూర్తిగా కొట్టిపారేయడం కూడా అంతే తప్పు. అసలు ప్రశ్న ఆరోపణ చేసిన వ్యక్తి ఎవరు అన్నది కాదు; ఓటరు పేరు ఎందుకు తొలగించబడింది, ఆ ప్రక్రియలో ఎలాంటి ధృవీకరణ జరిగింది, సంబంధిత వ్యక్తికి ఎలాంటి సమాచారం ఇచ్చారు అన్నదే.

ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఒక అత్యంత సున్నితమైన పత్రం. అందులో ఒక పేరు చేరడం ఎంత ముఖ్యమో, ఒక పేరు తొలగించడం కూడా అంతే బాధ్యతతో జరగాలి. ప్రతి తొలగింపుకూ స్పష్టమైన కారణం ఉండాలి. సంబంధిత వ్యక్తికి సమాచారం అందాలి. అభ్యంతరం చెప్పే అవకాశం ఉండాలి. తప్పుగా తొలగించిన పేరు తిరిగి చేర్చేందుకు వేగవంతమైన, సులభమైన మార్గం ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియ ప్రజలకు కనిపించేంత పారదర్శకంగా ఉండాలి. అందుకే ఇప్పుడు అవసరమైనది ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదు – ప్రక్రియపై స్పష్టత. ఓటరు జాబితా ప్రక్షాళనపై ఎవరికీ అనుమానం రాకుండా ఎన్నికల సంఘం తన విధానాలను మరింత బహిరంగం చేయాలి. ఎన్ని పేర్లు తొలగించారు? ఎందుకు తొలగించారు? ఎంతమందికి నోటీసులు ఇచ్చారు? ఎంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు? వాటిలో ఎన్ని పరిష్కరించారు? వంటి వివరాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటే అనుమానాలకు తావు తగ్గుతుంది.

చివరకు ఓటు ఒక పౌరుడి గొంతు. ఆ గొంతు వినిపించే అవకాశాన్ని ఒక పరిపాలనా ప్రక్రియలోని పొరపాటు వల్ల కోల్పోయే పరిస్థితి రాకూడదు. ఓటరు జాబితా శుద్ధీకరణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి కానీ, అదే ప్రక్రియ ప్రజల్లో అనుమానాలకు కారణమైతే దాన్ని సమీక్షించాల్సిన బాధ్యత కూడా వ్యవస్థదే.

ప్రక్షాళన సరే.. పారదర్శకత ఏది? ఓటరు జాబితా శుద్ధి పేరుతో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటమే నిజమైన ఎన్నికల సంస్కరణ. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రశ్న కేవలం– "ఓటు పడిందా?" అన్నది కాదు. అంతకుముందే – "ఓటు జాబితాలో ఉందా?" అన్నదే కీలకం.

# ఆధిపత్య సంకెళ్లపై జెన్-జీ పోరాటం

**(అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్టు 12)**

ఆర్థిక వ్యవస్థకు యువ జనాభా పునాది వంటిది. ప్రస్తుతం పలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువతీ, యువకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని జనాభా దోరణులు పేర్కొంటున్నాయి. వారికి సరైన అవకాశాలు కల్పించి శ్రామిక శక్తిలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రపంచ దేశాలు అగ్రగామిగా నిలుస్తాయని నిపుణులు అంటున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లో యువత ఆశలు, ఆశయాలకు భిన్నంగా ప్రభుత్వ విధానాలు కొనసాగడంతో సంఘర్షణలు నెలకొంటున్నాయి. ఇందుకు జెన్ జీ ఉద్యమాలే నిదర్శనం. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, మడగాస్కర్, మొరాకో, పెరూ వంటి పలు దేశాల్లో జన్-జీ తరం సృష్టించిన రాజకీయ సంచలనం అంతాఇంతా కాదు. అవినీతి ఆరోపణలు, పోలీసుల అరాచకాలు, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలపై తమ అసహనాన్ని వ్యక్తం చేసేందుకు వారు రోడ్డెక్కారు. తమ నిరసనలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహనను పెంచేందుకు జన్‌జీ లు సామాజిక మాధ్యమాన్ని అస్త్రంగా వినియోగించారు. సంఘటితమవుతున్నారు. భారతదేశంలో అభిజిత్ దీప్కే నాయకత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ యువత సమస్యలపై గళమెత్తుతుంది. నీట్ పరీక్ష లీకేజీపై జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఈ ఉద్యమం దేశ రాజకీయాలను కదిలించింది.

**యువత భవిష్యత్తుపై నిర్లక్ష్యం**

ప్రపంచవ్యాప్తంగా యువ జనాభా యొక్క ప్రాముఖ్యతతోపాటు వారి గళాన్ని తెలియడానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా ఆగస్టు 12న ప్రపంచ యువజన దినోత్సవం నిర్వహిస్తుంది. ప్రపంచ సామాజిక ,ఆర్థిక ,రాజకీయ ప్రక్రియలలో యువత భాగస్వామ్యాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. ఈ ఏడాది "విభిన్న సందర్భాలు, ఉమ్మడి ఆకాంక్షలు" అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది. భారతదేశంలో సుమారు 37 కోట్ల మంది యువత ఉన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే ఇదీ అత్యధికం. కానీ ఆ యువత భవిష్యత్తును నిర్మించడంలో అగ్రవర్ణ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఒకవైపు డిగ్రీ పట్టాలు చేతిలో




పట్టుకుని లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఉద్యోగాల హామీలతో యువతను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్న ప్రభుత్వాలు, వారికి శాశ్వత ఉపాధి-న్యాయం కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నాయి. నేడు ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగ భద్రత లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గిగ్ వర్క్ వంటి అస్థిర ఉపాధి విధానాలు పెరుగుతున్నాయి. గంజాయి, డ్రగ్స్ మాయలో చిక్కుకుని ఒక తరం తన భవిష్యత్తును కోల్పోతోంది. ఈ వ్యవస్థాగత చీకటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ యువతే ఎక్కువగా నష్టపోతోంది. దేశవ్యాప్తంగా విద్యా, ఉద్యోగ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారం, గతంలో తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమ్స్, తాజాగా ఝార్ఖండ్ లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా వేలాది మంది యువత రోడ్డెక్కారు. ఈ విధంగా యువతకు చదువుకున్న తర్వాత ఉద్యోగం లేకపోతే? విద్య అందుబాటులో ఉన్నా నాణ్యమైన విద్య అందకపోతే? వైద్యం భారంగా మారితే? ఉపాధి భద్రత కరువైతే? సామాజిక వివక్ష విద్యాసంస్థల గడప దాటుకుని తరగతి గదుల్లోకి ప్రవేశిస్తే? అప్పుడు యువత రోడ్డెక్కడం ఆశ్చర్యమా? అనేది ప్రధాన ప్రశ్న. మరోవైపు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించిన యువతను అల్లరిమూకలు, దేశవ్యతిరేకులుగా ముద్రవేయడం గమనార్హం. కానీ చివరికి నిజం తేలింది-ఇప్పుడు ప్రభుత్వమే యువత జపం చేస్తోంది.

**జనాభా దామాషానే న్యాయమైన పరిష్కారం.**

అత్యధిక యువ జనాభా ఉన్న భారతదేశంలో యువతే దేశ భవిష్యత్ అని గర్వంగా కీర్తించినప్పటికీ...కుల ఆధిపత్యం ఆ భవిష్యత్తుకే సంకెళ్లు వేస్తోంది. చారిత్రకంగా ప్రతిభకు బదులు పుట్టుకను ప్రమాణంగా మార్చిన భారతీయ కుల వ్యవస్థలో అవకాశాలను సమానంగా పంచకుండా కొందరి చేతుల్లోనే విద్య, ఉద్యోగం, అధికారం, వనరులను కేంద్రీకృతమనవి. ఫలితంగా లక్షలాది అణగారిన వర్గాల యువత ప్రతిభ ఉన్నా అవకాశాల కోసం పోరాడవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ క్రమంలో యువత ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా యువతను నిందించడం సమస్యను పరిష్కరించదు.
దేశ సంపద, భూమి, పరిశ్రమలు, విద్యా సంస్థలు, వైద్య రంగం, ఉద్యోగ అవకాశాలు, నిర్ణయాధికారం వంటి కీలక రంగాల్లో సామాజిక అసమానతలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చకుండా కేవలం "మెరిట్", "ప్రతిభ", "పోటీ" అనే పదాలతో యువత భవిష్యత్తును నిర్వచించడం సామాజిక వాస్తవాలను కప్పిపుచ్చడమే. ఇప్పుడు సామాజిక అసమానతలపై జెన్-జీ పిడికిలి ఎత్తాలి. యువత కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదు, గౌరవం, సమానత్వం, పారదర్శకత, సామాజిక న్యాయం కోసం గళమెత్తాలి. నేటి సోషల్ మీడియా యుగంలో పెరిగిన ఈ తరం సమాచారాన్ని వేగంగా అందుకుంటోంది. ప్రపంచంలో ఒక మూలలో జరిగిన అన్యాయం మరొక మూలలో ఉన్న యువతకు క్షణాల్లో తెలుస్తోంది. ఈ క్రమంలో సామాజిక వెనుకబాటుతనం, చారిత్రక వివక్ష, ఆర్థిక పరిస్థితి-ఇవన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# నేటి యువతే.. రేపటి భారత భవిష్యత్తు

## ఢిల్లీ ఎయిమ్స్ సర్వే చేదు నిజాలు

**మత్తు మాయలో యువత.. దేశ భవిష్యత్తుపై పెను ప్రభావం**

డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వాలతో పాటు ప్రజా ఉద్యమం అవసరం. నేటి బాలలే రేపటి పౌరులు.. నేటి విద్యార్థులే రేపటి యువతరం.. నేటి యువతరమే రేపటి భారతదేశాన్ని తీర్చిదిద్దే శక్తి. దేశ జనాభాలో 36 ఏళ్ల లోపు వయసున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఇంతటి భారీ యువశక్తి సక్రమమైన మార్గంలో నడిస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. అయితే యువతలో కొంతమంది మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు బానిసవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.
విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. విద్యాసంస్థలు కేవలం నాలుగు గోడల మధ్య చదువు చెప్పే కేంద్రాలు కాకుండా.. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే వేదికలుగా మారాలి. విద్యార్థుల ప్రవర్తన, స్నేహ సంబంధాలు, ఆలోచనా విధానం, చదువుపై ఆసక్తి తదితర అంశాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాల్సిన అవసరం ఉంది.

**చిన్న వయసులోనే మత్తు బారిన..**

మెట్రో నగరాలు, పట్టణాలు, మురికివాడల్లో చిన్నారులు సైతం మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల్లో 11, 12, 14 ఏళ్ల వయసులోనే మత్తు పదార్థాలను వినియోగి స్తున్న బాలల ఉదంతాలు వెలుగులోకి వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఉన్నత విద్యాసంస్థలు, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై తరచూ కేసులు నమోదవుతుండటం తీవ్రంగా పరిగణిం చాల్సిన అంశం.
మత్తుకు బానిసైన యువతలో మానసిక, శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కుటుంబ సభ్యులకు తెలియకుండా వ్యసనాల బారినపడుతున్న యువత తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. కొందరు మత్తు కోసం నేరాలకు పాల్పడుతూ చివరకు పోలీసులకు చిక్కుతున్న ఘటనలు కూడా ఉన్నాయి.

**నేరాల వైపు మళ్లుతున్న యువత**

2012లో కుషాయిగూడ పరిధిలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న 15 మంది విద్యార్థులు పట్టుబడిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. చెడు



వ్యసనాలకు బానిసై డబ్బు కోసం నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇలాంటి ఘటనలు యువత పెడదారి పడితే వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలపైనా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియజేస్తున్నాయి.
మద్యం, డ్రగ్స్ మత్తులో కాలనీలు, బస్తీల్లో గొడవలకు దిగడం, దాడులకు పాల్పడటం, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు, సైబర్ నేరాలకు పాల్పడటం వంటి ఘటనల్లో యువత ప్రమేయం ఉండటం ఆందోళనకరంగా మారింది.

**కేసులు పెరుగుతున్నా.. శిక్షలు ఆలస్యం**

మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ కేసుల విచారణలో జాప్యం నేరస్తులకు అనుకూలంగా మారకూడదు. ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం, న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్, న్యాయమూర్తులు, సిబ్బంది కొరత వంటి సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉంది.
ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులను వేగంగా విచారించి, నేరం రుజువైన వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. శిక్షలు త్వరగా అమలైతే నేరాలకు పాల్పడేవారిలో భయం ఏర్పడుతుంది. అదే సమయంలో మత్తుకు బానిసైన వారిని కేవలం నేరస్తులుగా చూడకుండా.. అవసరమైన కౌన్సెలింగ్, పునరావాసం అందించడం కూడా అత్యంత ముఖ్యం.

**డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టి పోరాటం**

తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు రాష్ట్రంలోకి రాకుండా తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల కదలికలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. పోలీసు శాఖతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.

**ప్రజా ఉద్యమంగా మారాలి**

డ్రగ్స్ నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత కాదు. ప్రతి తల్లిదండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. డ్రగ్స్ విక్రయాలు, సరఫరా గురించి సమాచారం తెలిసినప్పుడు పోలీసులకు తెలియజేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.
యువతను క్రీడలు, విద్య, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ వంటి సృజనాత్మక రంగాల వైపు మళ్లించాలి. క్రమశిక్షణ, దేశభక్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వం వంటి విలువలను చిన్ననాటి నుంచే పెంపొందించాలి.
నేటి యువతను కాపాడితేనే రేపటి భారతదేశాన్ని కాపాడినట్లవుతుంది. యువత మత్తుకు బానిస కాకుండా.. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు.. సమాజం మొత్తం కదలాలి. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన ప్రజా ఉద్యమంగా మారినప్పుడే ఆరోగ్యకరమైన, బలమైన భారతదేశాన్ని నిర్మించగలం. మత్తులో నేటి యువత యువకులు మునిగి తేలడం. ఆందోళన కలిగిస్తుంది. ఎక్కువగా అత్యాచారాలు. హత్యలు. దాడులు. మత్తులోనే జరిగిపోతున్నాయి. మత్తు లేనిదే యువత జీవించడం లేదు. మత్తుకు బానిసై జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే డ్రగ్స్. గంజాయి. బారినపడి మత్తు నుంచి బయటికి రాలేకపోతున్నారు. మత్తు వల్ల ఎన్నో కుటుంబాలు సర్వనాశనం అయిపోతున్నాయి. ఎక్కడపడితే అక్కడ గంజాయి. డ్రగ్స్. దొరకడం వల్ల దానికి బానిసై. తమ భవిత పై ఆలోచించడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో. ఎక్కువగా యువతి యువకులే పట్టుబడడం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వాలు ఎన్ని మార్పులు తెచ్చినప్పటికీ ప్రజల్లో మాత్రం మార్పు ఆశించిన స్థితిలో రావడం లేదు. ప్రజలలో కూడా గొప్ప మార్పు వచ్చి డ్రగ్స్. గంజాయి. మత్తు పదార్థాలను నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాటిపై కఠినమైన చర్యలు తీసుకొని ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను రూపొందించాలి.

దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

# "కులం" అనే సత్యాన్ని దాటలేని "హిందూ ఐక్యత"



ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవలి కాలంలో కుల వివక్షకు వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు పైకి చూస్తే సామాజిక సంస్కరణకు అనుకూలంగా కనిపిస్తాయి. హిందువుల మధ్య కుల భేదాలు ఉండకూడదని, దేవాలయం, బావి, శ్మశానం అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిస్తున్నారు. కుల ఆధారిత వివక్షను మనస్సులోంచే తొలగించాలని కూడా చెబుతున్నారు. ఇవన్నీ స్వాగతించాల్సిన మాటలే. కానీ భారతదేశంలో కులం కేవలం మనస్తత్వ సమస్య మాత్రమే కాదు. అది సామాజిక అధికారం, భూమి, విద్య, ఉపాధి, ఆర్థిక వనరులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవంతో ముడిపడిన నిర్మాణాత్మక వ్యవస్థ. అందువల్ల కులాన్ని 'మనస్సులోంచి' తొలగించాలని చెప్పడం తేలికే. కానీ అది మాత్రమే సరిపోదు. ఆ కుల వ్యవస్థ ద్వారా తరతరాలుగా ఏర్పడిన అసమాన అధికార సంబంధాలను కూడా మార్చాలి.
ఇక్కడే ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్న 'హిందూ ఐక్యత'కు అసలు పరీక్ష ఎదురవుతుంది. హిందువులందరూ ఒక్కటే అని చెప్పడం సులభం. కానీ అదే సమాజంలో ఎవరు పూజారి కావాలి?, ఎవరు దేవాలయంలోకి వెళ్లాలి?, ఎవరు ఏ పని చేయాలి?, ఎవరి ఇంట్లో ఎవరు భోజనం చేయాలి?, ఎవరి పిల్లలు ఎవరిని వివాహం చేసుకోవాలి? అనే ప్రశ్నల వద్ద కులం ఇంకా బలంగా పనిచేస్తోంది. కాబట్టి మతపరమైన ఐక్యతను ప్రకటించడం కంటే సామాజిక సమానత్వాన్ని ఆచరణలోకి తీసుకురావడమే అసలైన సవాలు.
భగవత్ 'ఒక దేవాలయం-ఒక బావి-ఒక శ్మశానం' వంటి నినాదాలు ఇవ్వడం ఇవ్వాళ్ళ కొత్త విషయం ఏమీ కాదు. 2025లో కూడా ఆయన కుల విభజనలను అధిగమించి హిందూ సమాజాన్ని ఏకం చేయాలని ఇదే భావనతో పిలుపునిచ్చారు. 2026లోనూ కులం ఆధారంగా వివక్షకు ముగింపు పలకాలని, అందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సమస్య ఆయన మాటల్లోని ఉద్దేశం మాత్రమే కాదు. ఆ మాటలు సామాజిక నిర్మాణాన్ని మార్చే కార్యాచరణగా మారుతున్నాయా ? అన్నదే ప్రధాన విషయం.
భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖే ఒక కీలక వాస్తవాన్ని అంగీకరిస్తోంది. 1931 తర్వాత సమగ్ర కుల జనగణన జరగకపోవడంతో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జనాభాకు అధికారికంగా పూర్తి స్థాయి విభజిత గణాంకాలు లేవని, మండల్ కమిషన్ వారి జనాభాను సుమారు 52 శాతంగా అంచనా వేసిందని మంత్రిత్వ శాఖ చెబుతోంది. అంటే భారతదేశంలో కుల అసమానతపై రాజకీయ చర్చ జరుగుతున్నప్పటికీ, దాని సామాజిక నిర్మాణాన్ని కొలిచే ప్రాథమిక జాతీయ డేటా దశాబ్దాలుగా అసంపూర్ణంగానే ఉంది అనే విషయాన్ని ఒప్పుకొని తీరాలి.
బిహార్ కుల ఆధారిత సర్వే ఈ చీకటి ప్రాంతాన్ని కొంతవరకు వెలుగులోకి తెచ్చింది. అక్కడ ఓబీసీ, అత్యంత వెనుకబడిన తరగతులు కలిపి జనాభాలో 63.14 శాతంగా ఉన్నట్లు నమోదైంది. షెడ్యూల్డ్ కులాలు 19.65 శాతం, షెడ్యూల్డ్ తెగలు 1.68 శాతంగా ఉన్నాయి. అంటే ఈ వర్గాలన్నీ కలిపితే బిహార్ జనాభాలో సుమారు 85 శాతం. ఈ గణాంకం ఒక ముఖ్యమైన రాజకీయ ప్రశ్నను ముందుకు తెస్తుంది. జనాభాలో ఇంత భారీ భాగం సామాజికంగా వెనుకబడిన వర్గాలైతే, దేశంలోని అధికారం, సంపద, ఉన్నత విద్య, ప్రొఫెషనల్ ఉద్యోగాలు, సంస్థాగత నాయకత్వంలో వారి వాస్తవ ప్రాతినిధ్యం ఎంత?
కుల వివక్ష కేవలం సామాజిక అవమానాల రూపంలోనే కనిపించడం లేదు. నేర గణాంకాలు కూడా దాని తీవ్రతను చూపుతున్నాయి. కేంద్ర హోంశాఖ సమర్పించిన అధికారిక సమాచార ప్రకారం, షెడ్యూల్డ్ కులాలపై నమోదైన నేరాలు 2021లో 50,900 నుంచి 2022లో 57,582కి, 2023లో 57,789కి చేరాయి. ఈ సంఖ్యలు కేవలం నేరాల సంఖ్యను మాత్రమే సూచిస్తాయి; నమోదుకాని ఘటనలు, సామాజిక ఒత్తిడితో ఫిర్యాదు చేయని కేసులు ఇందులో ఉండవు. కాబట్టి కుల వివక్షను కేవలం వ్యక్తిగత పక్షపాతం అని చెప్పడం వాస్తవాన్ని చిన్నదిగా చూపడమే.
మరింత ముఖ్యమైన ప్రశ్న ప్రాతినిధ్యానికి సంబంధించినది. ఒక సమాజంలో అణగారిన వర్గాలకు దేవాలయ ప్రవేశం కల్పించడం అవసరమే. కానీ అదే సమయంలో విద్యా సంస్థల్లో, న్యాయవ్యవస్థలో, మీడియా సంస్థల్లో, కార్పొరేట్ యాజమాన్యంలో, ఉన్నత పరిపాలనలో, జ్ఞాన ఉత్పత్తి వ్యవస్థల్లో వారి ప్రాతినిధ్యం ఎంత ఉందో కూడా ప్రశ్నించాలి. సామాజిక సమానత్వం అంటే మన రాజకీయ నేతలు అప్పుడప్పుడు కేవలం పక్కపక్కన కూర్చోవడం అనే రాజకీయ డ్రామాలు చేయటం కాదు. నిర్ణయాలు తీసుకునే బల్ల వద్ద సమాన స్థానం పొందడం.
ఇక్కడ ఆర్ఎస్ఎస్ విధానంపై విమర్శ అవసరం. 'హిందూ ఐక్యత' అనే భావనలో కుల భేదాలను పక్కనబెట్టి అందరినీ ఒకే మతపరమైన గుర్తింపులోకి తీసుకురావడం రాజకీయంగా శక్తివంతమైన వ్యూహం కావచ్చు. కానీ అది కుల అసమానతల మూలాలను ప్రశ్నించకపోతే, అణగారిన వర్గాల అసంతృప్తిని విస్తృత హిందూ గుర్తింపులో కలిపివేసే ప్రయత్నంగా మారే ప్రమాదం ఉంది. కులం వల్ల ఏర్పడిన అన్యాయాన్ని పరిష్కరించకుండా 'మనం అందరం హిందువులమే' అని చెప్పడం, బాధితుడి ప్రత్యేక సమస్యను సామూహిక గుర్తింపు వెనుక దాచే నీటిని అవుతుంది.
అందుకే కుల జనగణనపై దేశవ్యాప్త చర్చకు ప్రాధాన్యం పెరిగింది. 2026 జనగణనలో కుల వివరాలను కూడా సేకరించే నిర్ణయం ఈ చర్చకు కొత్త మలుపు ఇచ్చింది. 1931 తర్వాత తొలిసారిగా దేశవ్యాప్తంగా విస్తృత కుల సమాచారాన్ని సేకరించే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ డేటా బయటకు వచ్చిన తర్వాత సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమ విధానాలపై వాస్తవ ఆధారిత చర్చకు అవకాశం ఉంటుంది.
ఆర్ఎస్ఎస్ నిజంగా కుల రహిత సమాజాన్ని కోరుకుంటే, కుల గణాంకాలను ఎదుర్కోవడానికి భయపడాల్సిన అవసరం ఏమొచ్చింది?. జనాభా ఎంత? విద్యలో ప్రాతినిధ్యం ఎంత? ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఎంత? భూమి, సంపద, వ్యాపార యాజమాన్యంలో వాటా ఎంత? ఉన్నత సంస్థల్లో నిర్ణయాధికార స్థానాల్లో ఎవరు ఉన్నారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి కదా!?. ఎందుకంటే సమానత్వాన్ని కొలవడానికి నినాదాలు కాదు, గణాంకాలే ప్రామాణికం.
కుల వివక్షను నిర్మూలించడానికి డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో భారత రాజ్యాంగం ఇప్పటికే సమానత్వం, అంటరానితనం నిషేధం, రిజర్వేషన్లు, రక్షణ చట్టాలు వంటి బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ కేంద్రం స్వయంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలపై నేరాల నియంత్రణకు రాష్ట్రాలకు ప్రత్యేక సూచనలు జారీ చేయాల్సి వస్తోంది. అంటే సమస్య కేవలం చట్టాలు లేకపోవటం వల్ల కాదు; వాటి అమలు, సామాజిక అధికార సంబంధాలు, రాజకీయ సంకల్పం లేకపోవడం కూడా అంతే ముఖ్యమైనవి.
హిందూ ఐక్యతకు వ్యతిరేకంగా కుల సమానత్వం నిలబడాల్సిన అవసరం లేదు. నిజానికి నిజమైన ఐక్యతకు సమానత్వమే పునాది. అయితే సమానత్వం లేకుండా ఐక్యతను కోరడం అంటే అది పైపై నినాదాల, ఎన్నికల రాజకీయ హామీల నుంచి నిర్మించిన రాజకీయ ఐక్యత మాత్రమే అవుతుంది. కుల బాధితుడికి గౌరవం, హక్కు, భూమి, విద్య, ఉపాధి, ప్రాతినిధ్యం, న్యాయం లభించకుండా కేవలం 'మనం ఒక్కటే' అని చెప్పినంత మాత్రాన చారిత్రక అన్యాయాన్ని తొలగించగలుగుతుందా?.
అందుకే భగవత్ మాటలను కొట్టిపారేయడం లేదు.అలా ఆలోచనలు చేయటం కూడా సరైంది కాదు.అలాగే వాటిని సంస్కరణకు చివరి మాటగా భావించడం మరింత తప్పు. అసలు ప్రశ్న ఏమిటంటే...ఆర్ఎస్ఎస్ 'హిందూ ఐక్యత'ను కుల నిర్మూలనకు వేదికగా మారుస్తుందా, లేక కుల అసమానతలను హిందూ గుర్తింపు వెనుక దాచిపెడుతుందా? భారత సమాజం ఆ ప్రశ్నకు సమాధానాన్ని ప్రసంగాల ద్వారా కాదు, ఆచరణ ద్వారా కోరుతోంది. కులం భారతీయ సమాజంలో ఇంకా సజీవ వాస్తవంగా ఉన్నంతకాలం, దాని గురించి మాట్లాడకుండా దానిని దాటిపోవడం సాధ్యం కాదు. హిందూ ఐక్యత ఎంత బలమైన నినాదమైనా, కులం అనే సత్యాన్ని అది తప్పించుకోలేదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# పశువైద్య సేవలు మెరుగుపరచాలి

- సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- తిమ్మాజీపేట వెటర్నరీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** పశుసంపద పరిరక్షణతో పాటు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పశువులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, పశువులకు నిర్వహిస్తున్న చికిత్సలు, అందుబాటులో ఉన్న మందులు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను, వైద్య సేవల నిర్వహణ తీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. పశువులకు వైద్యం కోసం రైతులు ఆసుపత్రికి వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడుతూ, పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తిమ్మాజీపేట మండల పరిధిలో ప్రస్తుతం ఉన్న పశువుల సంఖ్య, వాటి వివరాలు, పశువుల ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పశువుల సంఖ్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, పశువుల యజమానుల వివరాలు ఎంతవరకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారనే అంశంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పశుసంపద రైతుల జీవనోపాధిలో కీలకమైన భాగమని, పశువులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా రైతులకు ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. పశువులకు వ్యాధులు సోకినప్పుడు ఆలస్యం చేయకుండా చికిత్స అందించాలని, వ్యాధుల నియంత్రణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు అవసరమైన టీకాలు, వైద్య పరీక్షలు, చికిత్సలు నిర్ణీత సమయంలో అందుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలకు ఎక్కువగా ఆధారపడే రైతులకు ఆసుపత్రి సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేలా పశుసంవర్ధక శాఖ సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది విధులు తదితర అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువులకు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని, రైతులకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఆర్‌ఓ పాండు, తిమ్మాజిపేట సర్పంచ్ కవిత, మండల స్థాయి అధికారులు, పశు వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు

## బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- బోనమెత్తిన కంజర్ల విజయలక్ష్మి



**తాండూరు, అగస్టు 11 (జనంసాక్షి) :** ఆషాఢ మాసంలో భాగంగా సికింద్రాబాద్ బల్కంపేట రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో బోనాల సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక నేత కంజర్ల విజయలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించారు.ఆలయానికి చేరుకున్న విజయలక్ష్మి సంప్రదాయబద్ధంగా పట్టుచీరలో బోనం తీసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నానని తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పూజల్లో పాల్గొన్న మహిళలు, భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తి గీతాలతో, డప్పుల మోతలతో సందడిగా మారాయి.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి




**శంషాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** శంషాబాద్ జోన్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం, ఫీజుల వసూళ్లు, అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ జారీపై శంషాబాద్ జోన్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదిబట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్ సర్కిళ్ల అధికారులతో సమావేశమైన ఆమె పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హుల నుంచి ఫీజులు వసూలు చేసి ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆదేశించారు. ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.ఎన్. మెహ్రా, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ రెండో దశలో మరింత అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** 'ఎస్‌ఐఆర్' ప్రక్రియలో మొదటి దశ కంటే రెండో దశలో బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు, కాంగ్రెస్ శ్రేణులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఏఐసీసీ జాతీయ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వి. రవిశేఖర్‌రెడ్డి సూచించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సీరియస్‌గా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మంగళవారం 'ఎస్‌ఐఆర్' ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన జవహర్‌నగర్‌కు చెందిన సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి మక్బూల్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 17న ముసాయిదా జాబితా వెలువడే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉప్పరిపల్లి భూ సమస్యలు పరిష్కారానికి కృషి



**శామీర్‌పేట్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** ఉప్పరపల్లి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ఇన్‌చార్జ్ డాక్టర్ జి.చిన్నా రెడ్డి ఆదేశించినట్లు శామీర్ పేట్ మాజీ జడ్పీటీసీ బాలేష్ తెలిపారు.మంగళవారం శామీర్‌పేట్ మండలం ఉప్పరపల్లి గ్రామంలోని ప్లాట్ల సమస్యను పరిష్కరించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ బేగంపేట్ లోని ప్రజావాణిలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ముఖ్య మంత్రి ప్రజావాణి కార్య క్రమం ఇన్‌చార్జ్ జి.చిన్నారెడ్డిని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పి.బాలేష్ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఉప్పరపల్లి గ్రామంలోని ప్లాట్ల విషయానికి సంబంధించి గత కొంతకాలంగా నెలకొన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్య కారణంగా సంబంధిత భూములపై ఆధారపడిన అర్హులైన పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ముఖ్య మంత్రి ప్రజావాణి కార్యక్రమం ఇన్‌చార్జ్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిశీలించిన డాక్టర్ చిన్నారెడ్డి మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కి ఈ సమస్యను పరిశీలించి,నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే సంబంధిత రెవెన్యూ రికార్డులు, భూముల వాస్తవ పరిస్థితి, గతంలో జరిగిన విచారణలు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించి న్యాయ పరంగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.డాక్టర్ చిన్నారెడ్డి కలెక్టర్‌ను సమస్య పరిష్కారానికి ఆదేశించడం పట్ల ఉప్పరపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, త్వరితగతిన సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందజేయాలి



**కాప్రా, ఆగస్టు 11 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి కోరారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న అంశాలపై కలెక్టర్ తో ఎమ్మెల్యే చర్చించారు.అనంతరం సచివాలయంలో సంబంధిత అధికారులతో కూడా ఇందిరమ్మ ఇళ్ల అంశంపై చర్చించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.

## డిజిటల్ చెల్లింపు నిర్వహణ మరింత వేగవంతం

**ఖైరతాబాద్, ఆగస్ట్ 11 (జనం సాక్షి):** వన్97 క మ్యూనికేషన్స్ లిమిటెడ్‌కు పూర్తిగా అనుబంధ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమి టెడ్(పీపీఎస్ఎల్), ఆంథ్రపిక్స్ క్లౌడ్ తో మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్(ఎంసీపీ) కనెక్టర్ ద్వారా పేటీ ఎం పేమెంట్ గేట్‌వేను అనుసంధానించినట్లు పేటీ ఎం పేమెంట్ గేట్‌వే ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. వారు మాట్లాడుతూ ఈ సదుపాయంతో వ్యాపారాలు ఏఐ ప్రాంప్ట్‌ల ద్వారా లావాదేవీలు, పేమెంట్ లింకులు, రీఫండ్‌లు, సెటిల్‌మెంట్‌లు, సబ్‌స్క్రిప్షన్‌లు, ఆర్డర్ స్థితి, రీకన్సిలియేషన్ వివ రాలను సురక్షితంగా పొందవచ్చని తెలిపారు. మ ర్చంట్ అనుమతుల ఆధారంగా మాత్రమే సమాచా రం అందేలా భద్రతా నియంత్రణలు ఉంటాయని తెలిపారు. ఈ అనుసంధానం ఎంఎస్‌ఎంఈలు, పెద్ద సంస్థలు, డెవలపర్లు, ఆర్థిక, కస్టమర్ సపోర్ట్ బృందాలకు చెల్లింపు నిర్వహణను మరింత వేగ వంతం చేయనున్నట్లు వెల్లడించారు.

## అభివృద్ధి పనులను ప్రజల అభీష్టం మేరకు పూర్తి చేయాలి




**శేరిలింగంపల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు ప్రజల అభీష్టం మేరకు అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, ఇది సంబంధిత ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించి ప్రత్యేక దృష్టిని సాధించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు మరియు ఇంజనీరింగ్ అధికారులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, 'వన్ డే – వన్ వార్డ్' కార్యక్రమం పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన కొత్త పనుల ప్రతిపాదనలు, మరియు ప్రస్తుతం కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో డిప్యూటీ కమిషనర్లతో పూర్తి సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ నాణ్యతతో పూర్తి కావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## నందివనపర్తిలో వేగంగా సాగుతున్న యూజీడీ పనులు

**యాచారం, ఆగస్టు 11 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామ అభివృద్ధిలో భాగంగా మెయిన్ రోడ్డు ఎంట్రన్స్ వద్ద ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఈ యూజీడీ పనులను పంచాయతీ యంత్రాంగం వేగవంతం చేసింది.ఈ పనులను గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిరంతరం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, పారిశుద్ధ్య సమస్యలను పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నాణ్యతతో కూడి త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, వార్డు



సభ్యులు నూకం శ్రీలత మహేందర్ పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ను ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు



**మహేశ్వరం, ఆగస్టు 11 (జనంసాక్షి) :** కార్మికుల కోసం రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు.మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటియూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ...రంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ సెక్టార్లలో సుమారు 20 లక్షల మంది పనిచేస్తున్నారన్నారు.రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ లేకపోవడం వల్ల సనత్ నగర్, నాచారం వెళ్లవలసి వస్తుందన్నారు.కార్మికులకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలన్నారు.ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే కాలంలో కార్మికుల పక్షాన ఆందోళనలు చేపడుతామన్నారు.పరిశ్రమలలో పనిచేసే కార్మికుల కనీస వేతనాలు అమలు చేయకుండా, ఈఎస్ఐపిఎఫ్ లాంటి మౌలిక వసతులను అమలు చేయని కంపెనీల యాజమాన్యాల మీద ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కే. రామస్వామి, జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్,జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు,జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్మగళ్ల రాజు,మంజుల, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

- గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**తాండూరు, అగస్టు 11 (జనంసాక్షి) :** రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్దే లక్ష్యమని. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు నియోజకవర్గంలో ని బషీరాబాద్, యాలాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతి నిధులు, అధికారులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా, లూజు వైర్లు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈకి ఆదేశించారు.రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వాహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో వర్షాకాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సర్పంచ్ లకు ఆదేశించారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాల గురించి ఆరాతీశారు. వ్యవసాయానికి సంబంధించిన అంశాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలపై చర్చించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మహారాజ్ , ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి , వెంకట్ రాం రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలి

**రామచంద్రాపురం, ఆగస్టు 11 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా, సంఘటితంగా పనిచేయాలని టీయూడబ్ల్యూజే--ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ ఫైజల్ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే--ఐజేయూ విస్తృతస్థాయి సమావేశం రామచంద్రాపురంలోని లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫైజల్ మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీయూడబ్ల్యూజే--ఐజేయూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సుపాస్ సౌకర్యం కల్పించడంలో సంఘం పాత్ర మరువలేనిదన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు సంఘం అండగా ఉంటుందన్నారు. నియమనిబంధనలకు లోబడి సంఘం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ సంఘంలో ప్రతి జర్నలిస్టుకు గౌరవం దక్కుతుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైనప్పుడు సంఘటితంగా గొంతెత్తాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్



మాట్లాడుతూ పటాన్‌చెరు జర్నలిస్టుల సమిష్టి కృషితోనే తాను అంచెలంచెలుగా జిల్లా స్థాయికి ఎదిగానన్నారు. ఇక్కడి జర్నలిస్టులకు రుణపడి ఉంటానని, సభా వేదికగా పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సమావేశానికి టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, మల్లేష్ , జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్, ఫొటోగ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, చిన్న, మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

### పటాన్‌చెరు టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కార్యవర్గం

అనంతరం పటాన్‌చెరు అసెంబ్లీ టీయూడబ్ల్యూజే--ఐజేయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తి నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, సలహాదారులుగా కాశీపతి, సులేమాన్, నర్రా రామారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొనకుర్తి విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, బాణాపురం రమేష్, జాయింట్ సెక్రటరీలుగా వేణు, ప్రభాకర్, తిరునగరి శ్రీనివాస్ కుమార్,కోటేష్, శివాజీ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, జీవరత్నం, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్‌గౌడ్, సిద్దు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్‌రెడ్డి, విజయ్, నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, తోటి జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 11 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 11 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, పారిశుధ్యం, త్రాగు నీరు, సీటింగ్, తదితర ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పెన్షన్ల కోసం ఇదివరకు దరఖాస్తు చేసుకున్న వాళ్లు ప్రస్తుతం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 31వ తేదీలోగా అర్హులైన వారందరూ పెన్షన్ల కోసం సంబంధిత వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయడంలో అలసత్వం చూపకుండా నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) :** సైబర్ నేరాలు,డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట డీఎస్పీ నల్లపూ లింగయ్య అన్నా రు.మంగళవారమన ఊరు -- మన పోలీస్ కార్య క్రమంలో భాగంగా డీఎస్పీ నల్లపు లింగయ్య నారాయ ణపేట మండలం లింగం పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమా లు, ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ వాల్ ప్రాధా న్యతను డీఎస్పీ వివరిం చారు. ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతిభద్రతలు, చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధిం చిన సమాచారాన్ని చేర వేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ,సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండా లని సూచించారు.అపరి చిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్



మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పిన్,సివివి బ్యాంకు ఖాతా వివరాలు,పాస్‌వ ర్డ్‌లు ఇతరులకు వెల్లడించ వద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమా చారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.గ్రామంలో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబం ధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు పోలీ సులకు సహకరించాలని కోరారు.గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం, ప్రజల భద్రత ను మరింత పటిష్టం చేయ డంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదా రులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావా లని సూచించారు.ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు గ్రామ ప్రజలు సహకరించా లని డీఎస్పీ కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. పోలీసులకు ప్రజలు సహకరిస్తే గ్రామాల్లో నేరాలను మరింత సమ ర్థవంతంగా నియంత్రించ వచ్చు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండి, ఇత రులకు కూడా అవగాహన కల్పించాలి అని డీఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్సై సతీష్ రెడ్డి, పోలీ స్ సిబ్బంది, లింగంపల్లి గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఉద్యోగ సంఘాల నాయకుల పిలుపు



**సంగారెడ్డి, ఆగస్టు 11 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సంగారెడ్డి సంఘ భవన్‌లో జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మొహమ్మద్ షరీఫ్, కార్యదర్శి జె. నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దాస్య నాయక్, కార్యదర్శి ఖాదర్ బిన్ హసన్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్ కోశాధికారి ధనరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే సంగారెడ్డి జిల్లా టీఎన్జీఓఎస్ సంఘం అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ అలీ, కార్యదర్శి వేల్పూరు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జావిద్ అలీ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. దాస్య నాయక్ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్య భద్రత కొరకు ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, ప్రమోద్, యాదవ రెడ్డి, విజయ్ తదితరులు సమావేశంలో పాల్గొని నాల్గవ తరగతి ఉద్యోగులకు సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వసతి గృహాల పరిసరాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలోని వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా, పాములు, విషపురుగులకు ఆవాసంగా మారకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వసతి గృహాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై అన్ని సంక్షేమ శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలు, గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వసతి గృహాల పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొదలు, నిల్వ నీరు లేకుండా చూడాలని తెలిపారు. పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించి, వ్యర్థాలను సక్రమంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పాములు, ఇతర విషపురుగులు దాగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాముకాట్ల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వసతి గృహాల భవనాల చుట్టూ పరిశుభ్రతను పాటించడంతో పాటు రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి, తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, రక్త పరీక్షలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బంది ఇవ్వడం జరిగింది కాబట్టి పి.హెచ్.సి లలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ ఎస్ సి) సందర్శించి అక్కడి వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా గర్భిణీలకు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్, ప్రతి గర్భిణికి తప్పనిసరిగా రక్తహీనత (అనీమియా) పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న గర్భిణులకు అవసరమైన మందులు, పోషకాహార సలహాలు అందించి వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రసవ గదిని (లేబర్ రూమ్) పరిశీలించిన కలెక్టర్, అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రసవాలకు వచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని, పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం, జలుబు, వళ్ళు నొప్పులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఖచ్చితంగా రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, మెడికల్ ఆఫీసర్, ఇతర వైద్య అధికారులు, తదితరులు ఉన్నారు.

# కొల్లాపూర్ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- రహదారుల విస్తరణ, మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నాం
- ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో/కొల్లాపూర్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలు, సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.మంగళవారం ఏదుల మండల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మంత్రి జూపల్లి కృష్ణారావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జూపల్లి తెలిపారు. అనేక గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రహదారుల విస్తరణ, మరమ్మతు పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా రహదారి వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. మంచి రహదారుల వల్ల వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార రంగాల్లో ప్రజలకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అభివృద్ధిపై తగినంత శ్రద్ధ చూపలేదని మంత్రి విమర్శించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వెనుకబడిపోయాయని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కొల్లాపూర్ నియోజకవర్గ



అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పిల్లలకు విద్యతో పాటు మంచి విలువలు, సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు చెడు అలవాట్లు, వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పిల్లల స్నేహాలు, నడవడిక, చదువు, రోజువారీ కార్యకలాపాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలని, కుటుంబంలో మంచి వాతావరణాన్ని కల్పించాలని మంత్రి కోరారు. తల్లిదండ్రుల మార్గనిర్దేశం, ఉపాధ్యాయుల బోధనతోనే పిల్లలు క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగిన మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లకు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు ఆగస్టు 31 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్ నందు చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల అంశంపై డిఆర్డీఓతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, అదేవిధంగా బోదకాలు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫిలియా వంటి రక్త రుగ్మతలతో బాధపడుతున్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో అవసరమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన వారు అవసరమైన ధృవీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల వద్ద సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఎం రవి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుపల్లి వాగుపై హైలెవెల్ వంతెనకు 5 కోట్లు మంజూరు

- ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ గుర్సింగ బాపు



**మహదేవపూర్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** మహదేవపూర్ మండలంచంద్రుపల్లి వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి హ్యామ్ పథకం కింద ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు సర్పంచ్ గుర్సింగ బాపు తెలిపారు. ఈ సందర్భంగా నిన్నటి రోజు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపలుకార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాటారం మండల పరిషత్ కార్యాలయంలోలబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం అయినా అనంతరం కీలక ప్రకటన చేసినారని మహదేవపూర్ మండలంలో చంద్రుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చందుపల్లి వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 5 కోట్ల మంజూరు చేసినందుకు ఐటీశాఖమంత్రి శ్రీధర్ బాబు సర్పంచ్ గుర్సింగ బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు కొండ గొర్ల సంతోష్, గ్రామ ప్రజలు తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సర్పంచ్ గుర్సిగబాబు మాట్లాడుతూ ఈ వంతెనపూర్తి అయితే గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యం కలగడంతో పాటు వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో గ్రామాల్లో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని గుర్సింగబాబు అన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు కొండ గొర్ల సంతోష్ ఉన్నారు.

## పెంకెన కేజీబీవీలో దొరికిన డిజిటల్ టీవీ విద్యాశాఖాధికారి స్పష్టీకరణ

- జనం సాక్షి వార్త కథనానికి అద్భుత స్పందన


పంకెన కేజీబీవీలో వరుస చోరీలు
06 Aug 2026 - Page 3

**పలిమెల (జనం సాక్షి ఆగస్టు 11)** ఆగస్టు 6న ప్రచురితమైన "పెంకెన కేజీబీవీలో వరుస చోరీలు" అనే వార్తా కథనంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖాధికారి (ఇజూా) అధికారికంగా స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు విషయాలు వెల్లడించారు: లభ్యమైన ప్యానెల్ బోర్డు టీవీ పాఠశాల నుంచి చోరీకి గురైన సమగ్ర శిక్షకు చెందిన ఎల్జీ 65 ఇంచుల ప్యానెల్ బోర్డు పోలీసుల దర్యాప్తులో దొరికింది. ఈ టీవీ బోర్డును ఎత్తుకెళ్లిన నిందితులను స్థానిక పోలీసులు విచారిస్తున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఆ బోర్డును తిరిగి పాఠశాలకు అప్పగించనున్నారు. భవిష్యత్తులో పాఠశాలలో చోరీలు జరగకుండా ఉండేందుకు, సీసీటీవీలు నిరంతరం పనిచేసేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని అధికారులు లేఖలో స్పష్టం చేశారు.

## మూడేళ్లుగా అసంతృప్తిగా కౌకొండ రోడ్డు

- కౌకొండ క్రాస్ వద్ద వాహనాలు అడ్డుకుని నిరసన
- కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముక్కెర సురేష్ ఆగ్రహం



**నడి కూడ ఆగస్టు 11 (జనం సాక్షి) :** నడి కూడ మండలంకౌకొండ రోడ్డు పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కాంగ్రెస్ నాయకులు,కౌకొండ గ్రామస్తులు తిరుగుబాటు చేశారు.మూడేళ్లుగా రోడ్డు పనులు సగంలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌకొండ క్రాస్ వద్ద ఆందోళనకు దిగారు. ధర్మారం--పరకాల రహదారిపై పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులుపేర్వాల భాస్కర్‌రావు, ముక్కెర సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కాంట్రాక్టర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌకొండ రోడ్డు పనులు ఏళ్ల తరబడి పూర్తికాకపోవడంతో రహదారి గుంతలమయంగా మారిందని, నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

మూడేళ్లుగా ఇదే దుస్థితికౌకొండ రోడ్డు పనులు ప్రారంభించి సగంలోనే నిలిపివేయడంతో రహదారి అధ్వానంగా మారిందని తెలిపారు. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రోడ్డు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంటోందన్నారు. రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు ఆదేశించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గ్రామస్తులు పలుమార్లు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి పనులు ప్రారంభించాలని కోరినా పట్టించుకోలేదని మండిపడ్డారు.

'ప్రజల ఇబ్బందులు కళ్లముందు కనిపిస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం దారుణం. ఎమ్మెల్యే ఆదేశాలు కూడా లెక్కచేయకుండా పనులు నిలిపివేయడం ఎంతవరకు సమంజసం. ? కౌకొండ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాల్సిందే. ధర్మారం-పరకాల రోడ్డుపై పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు చెందిన వాహనాలను కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. సామాన్య ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించకుండా కేవలం కాంట్రాక్టర్ వాహనాలను మాత్రమే నిలిపివేశామని నాయకులు తెలిపారు. కాంట్రాక్టర్ సంఘటనా స్థలానికి వచ్చి రోడ్డు పనులు ప్రారంభించే వరకు వాహనాలను కదలనివ్వబోమని స్పష్టం చేశారు. రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా రోడ్డు పనులను మధ్యలో నిలిపివేయడం సరికాదన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ వెంటనే స్పందించి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో మోర్తాల రాజు, మేకల చిరంజీవి, మహమ్మద్ లాల్, పేర్వాల వినయ్, మహమ్మద్ హైదర్, మేకల స్వామి తదితర కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

# సహకారం ఎవరికో..?

- పీఏసీఎస్ పాలకవర్గాల నియామకంలో రాజకీయ హడావుడి...
- నామినేటెడ్ పదవుల కోసం నేతల పోటీ...
- గాడ్ ఫాదర్ల చుట్టూ మొదలైన ప్రదక్షిణలు...



**వెంకటాపూర్ (రామప్ప),ఆగస్టు11(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలంలో నాలుగు సహకార సంఘాలు(పిఏసిఎస్)ఉన్నాయి. వీటి పరిధిలో నలుగురు చైర్మన్లు, నలుగురు వైస్ చైర్మన్ల తోపాటు అనేకమంది సభ్యులు ఉన్నారు.కాగా,సదురు సంఘాల పదవీకాలం గత ఫిబ్రవరి 14వ తేదీన ముగిసిపోవడంతో మొదట సదురు సంఘాల కు ప్రత్యేకాధికారులను నియమించారు.ఈ క్రమంలో కొంతమంది చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తిరిగి గతంలో ఉన్న పాలకవర్గాలను కొనసాగించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.దీంతో గతంలో కొనసాగిన పాలకవర్గమే ప్రస్తుతం కొనసాగుతుంది. వీరి పదవీకాలం సైతం ఈ నెల 14వ తేదీతో ముగిసిపోతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో కొత్త పాలకవర్గాలను నియమించేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంకటాపూర్ మండలంలోని రాజకీయ వర్గాల్లో హడావుడి మొదలైంది. పీఏసీఎస్ పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులుగా స్థానం దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతున్నారు.ఎలాంటి ఎలక్షన్ లేకుండా ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆశావాహులు జాబితాలో చోటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు మొదలుపెట్టారు.పార్టీలో కొనసాగుతూ రైతుల వద్ద పేరు ప్రఖ్యాతి ఉన్న నేతలకు పాలకవర్గంలో అవకాశం కల్పించాలని నిబంధన వెలువడడంతో మండలంలోని నాయకులు తమ తమ పేర్లను అధిష్టానం దృష్టికి తెలియజేస్తున్నారు.మండలంలో ముఖ్యంగా సొసైటీ చైర్మన్ ల కోసం పోటీ తీవ్రతరమైంది. ఇప్పటికే తమ తమ గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టారు.

అయితే చైర్మన్,వైస్ చైర్మన్,డైరెక్టర్లను ఎంపిక చేయడంపై మంత్రి ప్రత్యేక దృష్టికి సారించినట్టు తెలిసింది. పాలకవర్గాల జాబితాలో పార్టీ విధేయులు, సీనియర్లు, రైతులతో మంచి సంబంధాలు ఉన్న వారికి అవకాశం కల్పించేలా చూస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే మండలంలోని కొంతమంది పేర్లను సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా..పార్టీ కోసం తాము అనేక సంవత్సరాలనుండి పనిచేస్తున్నామని , గ్రామాల్లోని రైతులకు అనేక మార్లు అండగా సైతం నిలిచామని,ఈసారి మాకు అవకాశం ఇవ్వాలంటూ మండలంలోని చాలామంది సీనియర్ నేతలు, రైతు సంఘాల నాయకులు స్థానిక ముఖ్య నేతలతోపాటు మంత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే మండలం లోని కొన్ని పాలకవర్గాల జాబితా సిద్ధం కాగా,మరికొన్ని సంఘాలకు చైర్మన్ పోస్టును ఆశించేవారు ఎక్కువగా ఉండటంతో మంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. రైతుల సంక్షేమ కోసం పనిచేసే వారికే పాలకవర్గంలో అవకాశం కల్పించాలని, స్వార్థ రాజకీయాల కోసం కుట్రలు కుతంత్రాలు చేసే వారికి చోటు కల్పించవద్దని మండల రైతులు కోరుతున్నారు. వడ్డించేవాడు మనోడైతే.. ఏ మూలకున్న భోజనం దొరుకుతుందనే ధోరణి లో కొంతమంది నాయకులు పాలకవర్గంలో చోటు దక్కించుకునేందుకు తమ తమ తెలివిని ఉపయోగిస్తూ మండలం లోని పార్టీ పెద్దలను మచ్చిక చేసుకుంటున్నారు. ఏదేమైనప్పటికి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రకారంగా వెంకటాపూర్ మండలంలో సొసైటీల పాలకవర్గాల నియామకం జరుగుతుందా...లేదా మండల పార్టీ నేతల ఆలోచన మేరకే నియామక ప్రక్రియ జరుగుతుందా అనేది చూడాలి మరీ.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ములుగు నియోజకవర్గం 100 శాతం పూర్తి

- 2,36,970 మంది ఓటర్లలో 2,09,128 మంది వివరాల డిజిటలైజేషన్
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 11(జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 27,842 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 8,354 మంది మరణించిన వారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 11.75 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన 11.75 శాతం కలిపి ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.



## రంగు వినోద దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి...

**పెద్దవంగర ఆగష్టు 11(జనం సాక్షి )** మండలంలో కోరిపల్లి గ్రామం నికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగు మురళి తల్లి రంగు వినోద, ఇటీవల అనారోగ్యం మరణించిన్నారు దశదిన కర్మ వేడుకల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాల్గొని తరువాత రంగు వినోద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఆకాంక్షించారు.

## తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- దేవాదుల నీటి నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి అని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హన్మకొండ జిల్లా చింతగట్టులోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నియోజకవర్గాల శాసనసభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి దేవాదుల ప్రాజెక్ట్ నీటి నిర్వహణ, నీటి వినియోగం, పంపు గృహాల పనితీరు, నీటి లభ్యతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో తగినంత వర్షపాతం లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని భీమ్‌ఘనపూర్ చెరువు నుండి వస్తున్న నీటిని రామప్ప చెరువు నుంచి వయా వంగపెల్లి వాని చెరువు ద్వారా గణపసముద్రం చెరువులోకి విడుదల చేయాలని సూచించారు. గణపసముద్రం చెరువు నింపాలని, నీటి నిల్వ ఉంటే భూపాలపల్లి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తదని అన్నారు. అదేవిధంగా పరకాల చలివాగులో కూడా నీరు ఎప్పటికీ నిండుగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామప్ప చెరువు నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా భూపాలపల్లి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు కడియం శ్రీహరి, నాగరాజు, యశస్విని రెడ్డి, నీటి పారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల ఆగస్ట్ 12(జనంసాక్షి) :** 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరపాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం, సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటుపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శ కాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకల నిర్వహణ నిమిషాల వారీగా పక్కా ప్రణాళిక ప్రకారం జరగాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో జాతీయ సమైక్యత ప్రతిబింబించేలా చూడాలని పేర్కొన్నారు. అవార్డుల ప్రధానోత్సవంపై స్పందిస్తూ, ఈసారి అన్ని శాఖల నుంచి ఇచ్చే పురస్కారాల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వేడుకల ప్రాంగణంలో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిరోధించాలని, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన స్టాళ్లను సైతం సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రా, రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓలు జగదీశ్వర్ రావు, మోహన్ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా మండల తహశీల్దార్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్కడ రోజు గొడవలే..!

- తీరని గేటు, గెట్టు పంచాయతీ
- కిరాయిదారుకు మరో స్థల యజమానికి మధ్య గొడవ
- ఇబ్బంది పడుతున్న కస్టమర్లు



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని చౌరస్తాకు సమీపంలో గల కిరాయిదారు అయిన ఓ మెస్ ఓనర్ కి అదే ప్రాంతంలో ఉన్నటువంటి ఓ స్థల యజమానికి మధ్య దారి విషయంలో గత కొన్ని రోజులుగా వివాదాలు చోటుచేసుకున్నాయి. అవతల ఉన్నటువంటి స్థల యజమాని తమ స్థలంలో ఎలాంటి వాహన పార్కింగ్ గాని, వాహనాలు గాని నిలుప రాదని బోర్డు పెట్టడమే కాకుండా అక్కడ కొంతమందిని పెట్టి వాహనాలు నిలపకుండా ప్రతిరోజు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. తాము 36 సంవత్సరాలుగా ఇక్కడ మెస్ నిర్వహిస్తున్నామని, తమ మెస్సుకు వచ్చే కస్టమర్లుకు ప్రస్తుతం గేటు పెట్టడంతోపాటు, లోపలికి ఎవరైనా కస్టమర్లు వస్తుంటే వారిని అడ్డుకునే ప్రయత్నం కొందరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమ వ్యాపారానికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేయడం కనిపిస్తుంది. అయితే అవతల ఉన్నటువంటి స్థల యజమాని కి సంబంధించిన కొందరు అంతేకాకుండా తమకు కోర్టు ద్వారా ఆర్డర్ ఉందంటూ చెప్పడం జరుగుతుంది. అయితే ఓ ఇంటిలో కిరాయి దారు అయినటువంటి సదరు మెస్ యజమాని మాత్రం జాయింట్ ప్యాసేజ్ కింద రోడ్డు ఉందని తాము కూడా ఆ రోడ్డును వాడుకోవడానికి హక్కు ఉందంటూ డిమాండ్ చేయడం మాత్రం గేటు వద్ద వాహన పార్కింగ్ చేయవద్దని, అది తమ యజమాని స్థలం అంటూ అక్కడికి వస్తున్న కస్టమర్లకు చెబుతుండడంతో ప్రతిరోజు గొడవ జరుగుతూనే ఉంది. ఈ సమస్య వల్ల మెస్ లో భోజనం చేయడానికి వస్తున్న కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పోలీసులు రావడం సర్ది చెప్పడం వెళ్లడం మళ్ళీ అదే పంచాయతీ వస్తుండడం అక్కడ న్యూసెన్స్ గా తయారైంది. అంతేకాకుండా తాజాగా పబ్లిక్ రోడ్డుమీద ఉండి మాట్లాడుతున్నటువంటి కొందరి మీడియాకు చెందిన వారి ఫోటోలు వీడియోలు తీస్తూ అక్కడున్నవారు ఇబ్బందికరంగా ప్రవర్తించడం జరుగుతుంది. సాధారణ ప్రజలను కూడా వీరు వదలడం లేదు. కిరాయిదారుకు అవతల ఉన్నటువంటి స్థల యజమానికి మధ్య సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలి కానీ గొడవలు పడుతూ ఇబ్బందికరంగా వ్యవహరించడం సరైనది కాదని స్థానిక వ్యాపారులు ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యను పరిష్కరించి ఇరువర్గాలకు తగిన సూచనలు చేయాలని కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
12 ఆగస్టు 2026

# యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లపై సీపీఎం ప్రజా ఉద్యమం

- పాలకులు నిర్లక్ష్యం వీడి నిధులు విడుదల చేయాలి
- ఆగష్టు 29,30,31భువనగిరి నుండి హైదరాబాద్ పాదయాత్ర
- 31న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం మహాధర్నా
- సీపీఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్

**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగష్టు 11 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో గత, ప్రస్తుత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని వాటి పరిష్కారం కోసం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కీలక ప్రాజెక్టులుగా ఉన్న బస్వాపురం ప్రాజెక్టు, గంధమల్ల ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, నవాబ్ పేట రిజర్వాయర్ ప్రాజెక్టు, చిన్న నీటి పారుదల కాలువలైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29, 30, 31తేదీలలో సీపీఎం చలో హైదరాబాద్ పేరిట రైతులు, నిర్వాసితులు,ప్రజలతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న




హైదరాబాద్ ఇందిరా ధర్నా చౌక్ కు చేరుకుంటుందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే " మహా ధర్నా " లో రైతులు, వ్యవసాయ కార్మికులు, నిర్వాసితులు, వృత్తి దారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 90 శాతం పూర్తయిన బస్వాపురం ప్రాజెక్టుకు మిగతా నిధులు ఇవ్వడంలో జాప్యంపై వివరణ ఇవ్వాలన్నారు. సుమారు 420 కోట్లకు పైచిలుకు డబ్బులు నిర్వాసితులకు చెల్లించవలసి ఉందన్నారు. 80 కోట్లు మంజూరు చేసినట్లు చెబుతున్న ఫైనాన్స్ కమిటీ వద్ద సంవత్సరం నుండి నిధులు నిలిచిపోయాయి. అన్నారు. అరకొర, అత్తెసరు నిధులు కేటాయిస్తూ దశాబ్దాల తరబడి ప్రాజెక్టు పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. భూ నిర్వాసితుల రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలన్నారు. పాలమూరి రంగారెడ్డి ప్రాజెక్టు ఎదుల రిజర్వాయర్ ద్వారా డిండి ప్రాజెక్టుకు నీళ్లు తేవాలన్నారు. డిండి ప్రాజెక్టు ద్వారా రాచకొండ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి రిజర్వాయర్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల గ్రామాలకు గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా నవాబుపేటకు నీళ్లు ఇస్తామని సుమారు 15 సంవత్సరాల కింద కాల్వలు తోవ్వారని కానీ అందులో నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువ వెడల్పు పనులు నిలిచిపోయాయి అన్నారు. పిలాయిపల్లి, బునాదిగాని కాలువల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాలువల కింద 30 కల్వర్టులు కట్టవలసి ఉందన్నారు. జిల్లాలో మూసి ప్రక్షాళన, గోదావరి జలాలు అనుసంధానంకై ప్రభుత్వం దగ్గర డిపిఆర్ లేదని విమర్శించారు. బస్వాపురం ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపడానికి పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించి నిధులు కేటాయించాలని, శామీర్పేట కాల్వ ద్వారా బొమ్మలరామారం, బీబీనగర్, భువనగిరి, పోచంపల్లి మండలాలకు సాగునీరు అందించాలన్నారు. ఈ నెల 16న సాగు తాగునీటి సమస్య పరిష్కారం కోసం వివిధ రాజకీయ పక్షాలతో, ప్రజాసంఘాలతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు పెద్ద ఎత్తున అన్ని వర్గాలు తరలిరావాలని యండి జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

# మండల ప్రభుత్వ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



**ఆళ్లపల్లి, ఆగష్టు 11 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ మండల ప్రభుత్వ వైద్య కేంద్రంలో అన్ని మెడిసిన్ ను అందుబాటులో ఉంచుకోవాలని సీజనల్ వ్యాధులు ఏజెన్సీ గ్రామాలలో ప్రబలకుండా మండల ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజల నుండి హాస్పిటల్ పై చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని వైద్య సిబ్బందికి తెలిపారు మలేరియా డెంగ్యూ టైఫా ఉన్న వారికి సకాలంలో వైద్యం అందేటట్టు చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు మండల ప్రజలు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువలు ఉంచకుండా చూసుకోవాలని దీనిపై ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.మండల వైద్య కేంద్రానికి డాక్టర్ లేనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దీన్ని పరిగణంలో తీసుకొని ప్రభుత్వానికి రిఫర్ చేశామని తెలిపారు మండల ప్రభుత్వ ఆస్పటల్ వైద్య సిబ్బంది అటెండెన్స్ పరిశీలించడం జరిగిందని మండల ప్రభుత్వ వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావాలని వైద్య సిబ్బందికి చురుకలంటించారు.ఈ కార్యక్రమంలో.డే డి ఎండ హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్,మండల ప్రభుత్వ పిఎస్సి మెడికల్ ఆఫీసర్ గోపి లాల్, హెల్త్ హెడాక్టర్ రమాదేవి, హెచ్ ఈ ఓ రామకృష్ణ,హెల్త్ జూనియర్ అసిస్టెంట్,హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం లు,ఎల్.టి,ఫార్మాసిస్ట్,ఎఫ్ ఎన్ ఓ,మిగతా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కొరకు ఐక్యంగా ఉద్యమించాలి

**సూర్యాపేట, ఆగష్టు 11 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట వంటి ప్రధాన వాణిజ్య, విద్యా, పారిశ్రామిక కేంద్రాన్ని బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ నుంచి తొలగించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదు దశాబ్దాలుగా సూర్యాపేటకు రైల్వే సౌకర్యం వస్తుందని చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఆ కల నెరవేరలేదన్నారు.తాజాగా ప్రతిపాదిత మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను పక్కన పెట్టడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను దెబ్బతీసిందని పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణానికి ఉన్న వాణిజ్య ప్రాధాన్యత, పెరుగుతున్న జనాభా, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, రైస్ మిల్లులు, జాతీయ రహదారి65పై ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని బుల్లెట్ ట్రైన్ మార్గంలో సూర్యాపేటను తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేశారు.ఈ నెల 13వ తేదీ నుంచి ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు, వంటావార్పు, జలదీక్ష, జాతీయ రహదారి 65 ముట్టడి, జిల్లా బంద్ వంటి దశలవారీ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనలో అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో మమేకం కావాలని



పిలుపునిచ్చారు.టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జునరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్, టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె యాదగిరి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోలిశెట్టి యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికార వెంకటయ్య, వెలుగు రమేష్, చిలుక రమేష్, డి.లాలు, డి.పాపిరెడ్డి, వెంకటేశ్వర్లు,శ్రీను, ఆనంద్, ప్రముఖ జర్నలిస్టు భూపతి రాములు,అల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు గిరిజన బాల బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

**భద్రాచలం, ఆగష్టు 11 (జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, జిపిఎస్ పాఠశాలల్లో చదివే గిరిజన బాల బాలికలు తల్లిదండ్రుల తర్వాత గురువులనే తల్లిదండ్రులుగా భావిస్తారని, అటువంటి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా జిపిఎస్ పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తును బాగుపడేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటిడిఏ పి ఓ. బి రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని బీఈడీ కళాశాలలో జిపిఎస్, ఏపీఎస్, ఏహెచ్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్దీపకం వర్క్ బుక్ -3, నిర్వహణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇస్తూ గిరిజన సంక్షేమ జిపిఎస్, ఆశ్రమ పాఠశాలలో చదివే గిరిజన బాల బాలికల విద్యాభ్యాసం పటిష్టం చేయడానికి గత సంవత్సరం ఉద్దీపకం వర్క్ బుక్ ఒకటి, రెండు ప్రవేశ పెట్టడం వలన విద్యాభ్యాసం కాస్త మెరుగుపడిందన్నారు. పిల్లల్లో ఇంకా ప్రతిభా పాటవాలు మెరుగుపడటానికి ఉద్దీపకం వర్క్ బుక్ 3లో పిల్లల చదువు, నైపుణ్యాలు మెరుగుపడేలా అలాగే కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఉద్దీపకం రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా పిల్లల యొక్క నైపుణ్యాలు, ప్రతిభను పరీక్షించడానికి పరీక్షలు నిర్వహించినప్పుడు పిల్లలు ఎవరికి వారే సొంతంగా రాసేలా ఉపాధ్యాయులు చూడాలని, పిల్లలకు మాత్రం పరీక్షలు రాసే సమయంలో ఉపాధ్యాయులు



సహకరించవద్దన్నారు. గురువులు చెప్పిన మాట పిల్లలు తప్పనిసరిగా విని ఆచరణలో పెడతారని అందుకు ఎస్జిటి ఉపాధ్యాయులు గిరిజన చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లలందరూ గురుకులం కాంపిటేటివ్ పరీక్షలలో ఉత్సాహంగా పాల్గొని సీట్లు సంపాదించే విధంగా నైపుణ్యాలను మేధాశక్తిని పెంపొందించేలా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఉద్దీపకం వర్క్ బుక్ 3 పై చక్కటి గేయం రచించిన మణుగూరు మండలం ఇప్పల సింగారం గ్రామంలోని జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవేంద్రను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, భద్రాచలం డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఏ సీఎంఓ రమేష్, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, జె సి డి వో అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

# హుడా లేఔట్‌లో ప్రభుత్వ భూమికి రక్షణ కరువు

**రాజేంద్రనగర్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ తిరుమల హిల్స్‌లో ప్రభుత్వ భూమి పరిరక్షణపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వే నంబర్లు 87, 119లోని హుడా లేఅవుట్‌కు చెందిన 6,054 చదరపు గజాల పార్కు భూమిని గత ఏడాది హైడ్రా అధికారులు కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో రక్షించి, చుట్టూ



ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.అయితే గత కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫెన్సింగ్‌ను తొలగించడంతో అక్రమ ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు, దానిని తొలగించిన వారిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ స్థలంలో పార్కు, వాకింగ్ కారిడార్ ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని మణికొండ కాలనీవాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

**మెదక్ బ్యూరో, ఆగష్టు 11 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పరిశుభ్రత, పచ్చదనం, సమతుల్యమైన మరియు ఆహ్లాదకరమైన



వాతావరణాన్ని కాపాడటంలో మొక్కలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు.నేటి మొక్కలే రేపటి మహావృక్షాలు అని పేర్కొన్న ఎస్పీ.. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. విక్రాంత్ కుమార్ సింగ్, సీఐ లు మహేష్, జర్జ్, రాజశేఖర్ రెడ్డి సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐ లు శైలెందర్, రామ కృష్ణ, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను కొట్టి చంపిన భర్త

**పెన్‌పహాడ్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** అనుమాన నెపంతో భార్యను నడిరోడ్డుపై దారుణంగా కొట్టి చంపిన ఘటన మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మండల పరిధిలోని నూర్జహాన్‌పేట గ్రామానికి చెందిన బానోతు రవి, అతని భార్య సునీత (36) మధ్య కొంతకాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. భార్యపై అనుమానంతో రవి తరచూ వేధిస్తూ, చంపేస్తానని బెదిరించేవాడని సమాచారం. సోమవారం రాత్రి భర్తతో గొడవ జరుగుతోందని, తనను చంపే ప్రమాదం ఉందని



సూర్యాపేటలో చదువుకుంటున్న కుమారుడు శ్రీశాంత్‌కు తల్లి సునీత ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం రాత్రి సుమారు 9 గంటల సమయంలో గ్రామంలోని సీసీ రోడ్డుపై గొడవ జరగడంతో రవి సునీతను కిందపడేసి మెడ, ఛాతీపై కాలితో బలంగా తొక్కడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విషయం గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో సునీతను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి మృతిచెందిన విషయం తెలుసుకున్న కుమారుడు శ్రీశాంత్ ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యాడు. తన తల్లిని హత్య చేసిన తండ్రి బానోతు రవిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పెన్ పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీశాంత్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీఐ జి. రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# ఇక్రిశాట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట

- ఎమ్మెల్సీ చొరవతో వేతనాల పెంపు.. 18 సెలవులు



**రామచంద్రపురం, ఆగష్టు 11 (జనం సాక్షి) :** ఇక్రిశాట్‌లో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సుమారు 300 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట లభించింది. ఎమ్మెల్సీ అంజి రెడ్డి చొరవతో నెలవారీ ఉద్యోగులకు నెలకు రూ.1,500, దినసరి ఉద్యోగులకు రోజుకు రూ.50 చొప్పున వేతనం పెంచడంతో పాటు ఏడాదికి 18 సెలవులు మంజూరు చేయనున్నారు. వేతనాల పెంపు, సెలవుల కోసం ఉద్యోగులు పలుమార్లు ఆందోళనలు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఆయన సంబంధిత ఏజెన్సీ, కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖ అధికారులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీంతో యాజమాన్యం వేతనాల పెంపు, సెలవులకు అంగీకరించింది. సమస్య పరిష్కారం కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరికి కృతజ్ఞతలు తెలిపేందుకు మంగళవారం రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ నివాసానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సన్మానించారు.

# క్రీడా ప్రతిభతో పాటు విద్యలోనూ విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు11 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని గ్రామం, యానం బైలు, రాజాపురం ప్రాంతాల్లోని పాఠశాలలు, పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల, యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, యానం బైలు పల్లె దవాఖాన, రాజాపురం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందుతున్న విద్య, క్రీడా శిక్షణ, వసతి, భోజనం, వైద్య సేవలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో సేవల అమలును స్వయంగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్ వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, ఇతర విద్యా సామగ్రి అందాయా, తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి



సూచించారు. క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న క్రీడా శిక్షణపై కూడా జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులు ఏయే క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు, ఆయా క్రీడల్లో వారి ప్రతిభ ఎలా ఉంది, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారా, అనంతరం యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించగా, ఆ రోజు మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి యానం బైలు పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో ప్రజలకు అందుతున్న ప్రాథమిక వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి చిన్నారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూలి పాఠశాలలు, క్రీడా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందించే భోజనం, పౌష్టికాహారం, విద్య, వైద్య సేవలు, మందులు, వసతి తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని సంస్థలను తరచూ సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని, లోపాలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు, చిన్నారులు, ప్రజల నుంచి వచ్చే సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి ప్రాధాన్యతతో పరిష్కారం చూపాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో తహసీల్దార్లు ధారా ప్రసాద్, ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### ఈవీ కొనుగోలుదారులకు

# గుడ్‌న్యూస్..

### సబ్సిడీ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద ఇచ్చే సబ్సిడీ గడువును 2028 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ పథకం అమలుకు మరో రూ.1000 కోట్లు అదనంగా కేటాయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ స్కీమ్ కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కిలోవాట్ అవర్ (ఎచిప్ర)కు రూ.2,500 చొప్పున సబ్సిడీ చెల్లిస్తారు. ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.5వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. 2024-25లో కిలోవాట్ అవర్‌కు రూ.5వేలు, ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.10వేలు సబ్సిడీ ఉండేది. ఎలక్ట్రిక్ టూవీలర్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1.5 లక్షలు దాటని వాహనాలకే ఈ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం కింద మొత్తం 45,79,120 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు లబ్ధి చేకూర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభాగం కోసం మొత్తం రూ.2,767 కోట్లు కేటాయించారు. పీఎం ఇ-డ్రైవ్ పథకానికి రూ.11,900 కోట్లు కేటాయించారు. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచే ఉద్దేశంలో పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. 2024 సెప్టెంబర్‌లో ప్రకటించిన ఈ పథకం గడువు 2027 మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సబ్సిడీ గడువు పొడిగించాలంటూ రాజ్యసభ స్టాండింగ్ కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖను కోరింది. ఈ క్రమంలో గడువు పెంపు నిర్ణయం వెలువడింది. నిర్దేశిత గడువు కంటే ముందే ఈ నిధులు పూర్తయితే కొత్త క్లెయిమ్‌లు స్వీకరించరు. అలాగే, ఇ-ద్విచక్ర వాహనాల సబ్సిడీ క్లెయిమ్ చేసుకోవడానికి 2027 డిసెంబర్ 31ని చివరితేదీగా నిర్ణయించారు.



# నష్టాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న అనిశ్చితి వల్ల చమురు ధరలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రియాల్టీ, ఎఫ్ఎంసీజీ, సిమెంట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో మార్కెట్ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ 78,509.77 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,542.44) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో సూచీ 78,048.26 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 388.19 పాయింట్లు క్షీణించి 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 112.10 పాయింట్లు కోల్పోయి 24,471.70 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.43 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఎటర్నల్, ఇన్ఫోసిస్, టైటాన్, హెచ్‌సీఎల్, టీసీఎస్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.53 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,373.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## అక్టోబర్‌లో భారత్‌కు యాపిల్ పే..

### యూపీఐ లేకుండానే!

అమెరికా టెక్ దిగ్గజం యాపిల్, భారత డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. యాపిల్ పే సేవలను అక్టోబర్‌లో అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఫోన్ నంబర్ లేకుండానే వీసా, మాస్టర్‌కార్డ్ డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా లావాదేవీలు చేసుకునే వెసులుబాటును తీసుకురానుంది. దీనికోసం ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకులతో యాపిల్ చర్చలు జరిపినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. యాపిల్ పే సాయంతో ఐఫోన్, యాపిల్ వాచ్ వినియోగదారులు ట్యాప్ అండ్ పే ద్వారా సులభంగా చెల్లింపులు చేయొచ్చు. యాపిల్ పేమెంట్ సిస్టమ్‌లో యూపీఐ సేవలు ప్రారంభంలో ఆలస్యమయ్యే అవకాశముంది. బయోమెట్రిక్ ఆథెంటికేషన్ నిబంధనల విషయంలో ఎన్‌పీసీఐతో




చర్చలు కొనసాగుతుండడమే ఇందుకు కారణం. యాపిల్ తన డివైజ్-లెవల్ సెక్యూరిటీకి ప్రాధాన్యం ఇస్తుండగా, ఎన్‌పీసీఐ మాత్రం జఎఆంఎ/ఆధార్ ఆధారిత ప్రా మాణీకరణ ఉండాలని చెబుతోంది. ఈ నిబంధనలలో తేడాల వల్లే యూపీఐ అనుసంధానం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. లావాదేవీల రుసుములపైనా: యాపిల్ పే ద్వా రా జరిగే ప్రతి లావాదేవీపై ప్రపంచవ్యాప్తంగా 0.15 శాతం నుంచి 0.20 శాతం వర కు ఛార్జీలను యాపిల్ వసూలు చేస్తోంది. అయితే భారత్‌లో డిజిటల్ లావాదేవీల రుసుములు చాలా తక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఛార్జీల వసూలు విషయం లోనూ భారత బ్యాంకులతో యాపిల్ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

## ఈక్విటీల్లోకి తగ్గిన పెట్టుబడులు..

### డెట్ పథకాల్లోకి నిధుల వరద


**దిల్లీ:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి జులైలో నిధుల ప్రవాహం తగ్గుముఖం పట్టింది. రూ.24,697 కోట్లు మాత్రమే ఈ విభాగంలోకి పెట్టుబడుల రూపంలో వెళ్లాయి. జూన్ మాసంలో ఈ మొత్తం రూ.28,973 కోట్లుగా ఉంది. అలా పోల్చినప్పుడు 15 శాతం క్షీణత నమోదు కావడం గమనార్హం. ఈ మేరకు జులై నెలకు సంబంధించి మ్యూచువల్ ఫండ్ సంస్థల సమాఖ్య యాంఫీ సంబంధిత డేటాను వెలువరించింది. ఈక్విటీ కేటగిరీలో స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.7,768 కోట్లు పెట్టుబడుల రూపంలో వెళ్లాయి. మిడ్‌క్యాప్‌ల్లోకి రూ.6,192 కోట్లు, ఫ్లెక్సీక్యాప్‌లోకి రూ.4,710 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.1,322 కోట్లు పెట్టుబడులు వెళ్లాయి. జులై నెలలో మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి మొత్తంగా నికరంగా రూ.2.36 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో నికరంగా




రూ.52,949 కోట్లు పెట్టుబడులు తరలిపోవడం గమనార్హం. ముఖ్యంగా డెట్ ఆధారిత పథకాల్లోకి పెద్దమొత్తంలో పెట్టుబడులు రావడం కలిసొచ్చింది. ఈ విభాగంలో జులై నెలలో రూ.1.88 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో రూ.1.09 లక్షల కోట్లు తరలిపోయాయి. జులై నాటికి మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.82.22 లక్షల కోట్ల నుంచి రూ.85.76 లక్షల కోట్లకు పెరిగింది. జులై నెలలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల ప్రవాహం కొనసాగింది. మొత్తం రూ.1559 కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చాయి. జూన్‌తో నమోదైన రూ.3442 కోట్ల పెట్టుబడులతో పోల్చినప్పుడు మాత్రం ఈ మొత్తం తగ్గుముఖం పట్టింది.

## 17 నుంచి లలితా జువెలరీ ఐపీఓ..

**ముంబై:** ప్రముఖ జువెలరీ సంస్థ లలితా జువెలరీ మార్ట్ తొలి పబ్లిక్ ఇష్యూకి సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.1700 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ఆగస్టు 17న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. రూ.11,250 కోట్ల మార్కెట్ విలవతో ఐపీఓకు వస్తోంది. ఆగస్టు 14న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకుంటుంది. పబ్లిక్ ఇష్యూలో రూ.1,200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తున్నారు. 50 శాతం క్వాలిటీ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. షేర్లు ఆగస్టు 24న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి. ఐపీఓ నిధులను జువెలరీ రిటైల్ నెట్‌వర్క్‌ను, స్టోర్లను విస్తరించడానికి లలితా జువెలర్స్ వినియోగించనుంది. ఫిల్మ్, టెలివిజన్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ విపుల్ షాకు చెందిన సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్లను సమీకరించే లక్ష్యంతో ఐపీఓకు రానుంది. ఆగస్టు 18న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. ఆగస్టు 20న ముగియనుంది. ధరల శ్రేణి రూ 342-360గా కంపెనీ నిర్ణయించింది. ఆగస్టు 17న యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ తెరుచుకుంటుంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ ఐపీఓ జరగనుంది. ప్రమోటర్లుగా విపుల్ అమృత్‌లాల్ షా, షెఫాలి విపుల్ షా తమ వాటాను తగ్గించుకున్నారు. 50 శాతం క్వాలిటీ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించనున్నారు.




# మళ్లీ కొండెక్కిన బంగారం

- 6 రోజుల్లో రూ.9800..
- 2 నెలల గరిష్ఠానికి బంగారం ధర

**దిల్లీ:** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. 10 గ్రాముల పసిడి ధర తాజాగా రూ.1200 పెరగడంతో దేశ రాజధాని దిల్లీలో పసిడి ధర రెండు నెలల గరిష్ఠమైన రూ.1.57 లక్షల స్థాయికి చేరింది. వెండి సైతం కిలోకు రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. అంతర్జాతీయంగా చమురు మంటలు కొనసాగుతున్నా ట్రేడర్ల నుంచి బలమైన డిమాండ్ కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర మొత్తంగా రూ.9800 మేర పెరిగింది. 10 గ్రాముల పసిడి ధర జూన్ 12న రూ.1.56 లక్షలు ఉండగా.. ఇప్పుడు మళ్లీ అదే స్థాయికి చేరింది. ఆగస్టు 3న బంగారం ధర రూ.1.47 లక్షలుగా ఉంది. అటు వెండి



సైతం కిలో రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. ఏప్రిల్ 30న చివరిసారిగా వెండి ఈ ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4399 డాలర్లు, వెండి ఔన్సు 65 డాలర్లు చొప్పున ట్రేడవుతున్నాయి. దీన్ని అనుసరించి మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లోనూ పసిడి ధర రూ.1.57 లక్షలు, వెండి రూ.2.42 లక్షలు చొప్పున పలుకుతున్నాయి .అంతర్జాతీయ మార్కెట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,435 డాలర్ల స్థాయికి చేరినప్పుడూ చమురు ధరల్లో పెరుగుదల కారణంగా ధరలు దిగి వచ్చాయి. ఇప్పుడు కూడా హర్మూజ్‌ను తెరిచే విషయంలో అనిశ్చితి కొనసాగుతున్న వేళ క్రూడాయిల్ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. అయినప్పటికీ.. బంగారం, వెండి ధరలు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే, జులై నెలకు సంబంధించి అమెరికాలో కన్స్యూమర్ ప్రైస్ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాల గురువారం వెలువడనున్నాయి. దీని ఆధారంగా అక్కడి ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ఒక అంచనాకు వస్తుంది. ఈ డేటా బంగారం, వెండి ధరలను ప్రభావితం చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తప్పుడు నిర్ణయాలకు ఏఐని నిందించొద్దు

### బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన

ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మంగళవారం బ్యాంకులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. బ్యాంకు కార్యకలాపాల్లో ఏఐ మోడళ్లు ఉపయోగించాలి గానీ, మానవ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తప్పుడు నిర్ణయాలకు సాంకేతికతను సాకుగా చెప్పి తప్పించుకోరాదని స్పష్టం చేశారు. ఏఐ మోడళ్లు తీసుకునే నిర్ణయాలకు పూర్తి బాధ్యత బ్యాంకులే వహించాలన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఏఐ టూల్స్ వినియోగించాలి. కానీ మనుషుల నిర్ణయాలను పూర్తిగా రీప్లేస్ చేసేలా ఉండకూడదు. ఏదైనా నిర్ణయానికి సంబంధించి.. ఏఐ మోడల్ లేదా ఆల్గారిథం నిర్ణయం తీసుకుందని చెప్పి బ్యాంకులు తప్పించుకోలేవు. ఏఐ మోడల్ తప్పు చేసిందని చెప్పే సమాధానాన్ని ఆర్‌బీఐ గానీ, వినియోగదారులు గానీ అంగీకరించరు. ఏఐ వినియోగంలో సైబర్ సెక్యూరిటీ రిస్కులు ఉంటాయి. జాగ్రత్తలు పాటించాలి. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన ఏఐ గవర్నెన్స్ పాలసీని పాటించాలి.

## గౌతమ్ అదానీపై క్రిమినల్ అభియోగాల కొట్టివేత



**జనంసాక్షి:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టి వేసింది. దీంతో మోసం, లంచం ఆరోపణలకు సంబంధించిన కేసులో దాదాపు రెండేళ్లుగా సాగుతున్న విచా రణ ముగిసింది. కానీ మోసం, లంచం కేసును ఉపసంహరించు కోవాలనే న్యాయ శాఖ నిర్ణయంపై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ఇతర నిందితులపై అభియోగాలను కొట్టివేయాలా వద్దా అని నిర్ణయిం చుకోవ దానికి అవసరమయ్యే మరిన్ని వివరాలను సమర్పించాలని న్యాయ శాఖను ఆదేశించింది. అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని గౌతమ్ అదానీ స్వాగతించారు. న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకమే గెలిచిం దన్నారు. సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు దక్కించుకునేందుకు భారతీయ అధికారులకు సుమారు 250 మి. డాలర్ల లంచాలు చెల్లించారనేది అదానీపై ప్రధాన ఆరోపణ. అమెరికా మార్కెట్ల నుంచి నిధులు సమీకరించేటపుడు, ఈ విషయాన్ని బయటపెట్టకుండా పెట్టుబడిదార్లను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ.. అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ (2024లో) ఉన్నప్పుడే అదానీ, మరో ఏడుగురిపై నమోదు చేసిన అభియోగాలను కొట్టివేయాలని న్యాయ శాఖ కోరింది.


## ఇంధన సెగ చల్లారాలంటే..

## 100 నౌకలైనా వెళ్లాల్సిందే..!

**జనంసాక్షి:** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు ముగియకపోతే ఇంధన ధరలు పెరుగుతూనే ఉంటాయని బ్యాంక్ ఆఫ్ అమెరికా హెచ్చరించింది. హర్మూజ్‌లో చమురు ట్యాంకర్ల రాకపోకలకు తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. "ఘర్షణలకు పరిష్కారం లభిస్తుందని అంచనా వేస్తున్నాం. దాంతో ఒక బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 70 డాలర్ల నుంచి 80 డాలర్ల మధ్య ఉంటుందని ఆశిస్తున్నాం. పరిష్కారం లభించకపోతే.. ఈ శీతాకాలానికి ఇంధన సెగ మరింత పెరుగుతుంది. ప్రస్తుతం హర్మూజ్ నుంచి 5 నుంచి 10 నౌకలు వెళ్తున్నాయి. యుద్ధానికి ముందు ఆ సంఖ్య 140గా ఉంది. ఇంధన మార్కెట్లు సాధారణ స్థితికి చేరాలంటే.. రోజుకు 80 నుంచి 100 నౌకలు జలసంధిని దాటాల్సిందే. ప్రస్తుతానికి మార్కెట్‌లో తగినంత ముడి చమురు ఉంది. కానీ తుది ఉత్పత్తుల (పెట్రోల్, డీజిల్, గ్యాస్)కు మాత్రం తీవ్ర కొరత ఉంది" అని బ్యాంక్ ఆఫ్ అమెరికా పేర్కొంది.

ముడిచమురు ధరలు ఇలా..

డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా తమ షరతులు అంగీకరించే వరకూ హర్మూజ్ జల సంధిని తెరవబోమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇంధన భయాలు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు 88 డాలర్ల వరకు ఉండగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ (చిఎ) క్రూడ్ 82.20 డాలర్లుగా కదలాడుతోంది.



# నేడు సంపూర్ణ సూర్యగ్రహణం

### మన దగ్గర ప్రభావం ఉంటుందా?

**జనంసాక్షి:** ఆగస్టు 12న (బుధవారం) అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఇదే రోజు ఆషాఢ బహుళ అమావాస్య (చుక్కల అమావాస్య) కూడా కావడం విశేషం. ఈ గ్రహణం భారతదేశంలో కనిపించకపోయినా, ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రత్యక్షమవుతుంది. అందువల్ల ఈ గ్రహణానికి సంబంధించిన శాస్త్రీయ, ధార్మిక, జ్యోతిషపరమైన అంశాలను తెలుసుకోవడం అవసరం. ఈ ఏడాదిలో సంభవించే తొలి సంపూర్ణ సూర్యగ్రహణం ఇదే కావడం విశేషం. ఈ గ్రహణం ప్రపంచంలోని 55 దేశాల్లో ఏదో ఒక రూపంలో కనిపిస్తుంది. వాటిలో స్పెయిన్, ఐస్‌లాండ్ దేశాల్లో మాత్రమే సంపూర్ణ సూర్యగ్రహణం ప్రత్యక్షమవుతుంది. మిగిలిన 53 దేశాల్లో పాక్షిక సూర్యగ్రహణం మాత్రమే దర్శనమిస్తుంది.

గ్రహణ సమయం (భారత కాలమానం ప్రకారం).. పాక్షిక గ్రహణ ప్రారంభం: సాయంత్రం సుమారు 7 గంటలకు. సంపూర్ణ గ్రహణ ప్రారంభం: రాత్రి దాదాపు 9.15 గంటలకు. గరిష్ఠ గ్రహణం: రాత్రి సుమారు 11.17 గంటలకు. సంపూర్ణ దశ ముగింపు: రాత్రి సుమారు 1.20 గంటలకు (ఆగస్టు 13). గ్రహణం ముగింపు: తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు

ఈ గ్రహణం ప్రత్యేకత ఏమిటి?

ఈ సంపూర్ణ సూర్య గ్రహణంలో చంద్రుడు సూర్యబింబాన్ని పూర్తిగా కప్పివేయడంతో, కొన్ని ప్రాంతాల్లో సుమారు రెండు నిమిషాలకు పైగా సంపూర్ణ చీకటి ఏర్పడుతుంది. అదే సమయంలో



సాధారణంగా కనిపించని సూర్యుని బాహ్య వాతావరణమైన 'కరోనా స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖగోళ శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తారు. ఐరోపాలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షిక గ్రహణం కొనసాగుతుండగానే సూర్యాస్తమయం జరుగుతుంది. దీనిని 'గ్రస్తాస్తమయ గ్రహణం' అని పిలుస్తారు.

భారతదేశంలో ప్రభావం ఉందా?

ఈ గ్రహణం భారతదేశంలో ఎక్కడా కనిపించదు. అందువల్ల భారతదేశ ప్రజలకు ప్రత్యక్ష గ్రహణ దర్శనం ఉండదు. ధర్మశాస్త్రాలలో ప్రధానంగా దృశ్యగ్రహణమే ఆచారానికి ప్రమాణం. అందువల్ల భారతదేశంలో కనిపించని ఈ గ్రహణానికి సాధారణంగా సూతకం, దేవాలయాల మూసివేత, ఆహార నియమాలు, ప్రత్యేక శాంతులు వంటి ఆచారాలు అవసరం లేదని అనేక పంచాంగ సంప్రదాయాలు పేర్కొంటున్నాయి. ఈ సంపూర్ణ సూర్యగ్రహణం కర్కాటక రాశిలోని ఆశ్లేషా నక్షత్రంలో కేతుగ్రస్త సూర్యగ్రహణంగా సంభవిస్తోంది. జ్యోతిష సంప్రదాయం ప్రకారం.. గ్రహణం ప్రత్యక్షంగా దర్శనమిచ్చే ప్రాంతాల్లో నివసించే ఆశ్లేషా నక్షత్రజాతకులు, కర్కాటక రాశివారు గ్రహణ శాంతి, జపం, దానం వంటి శాస్త్రోక్త పరిహారాలు ఆచరించడం శ్రేయస్కరంగా భావిస్తారు. భారతదేశంలో ఈ గ్రహణం కనిపించనందున మన దేశంలో నివసించే వారికి గ్రహణ శాంతులు అవసరం లేదు. గ్రహణం ప్రత్యక్షంగా కనిపించే దేశాల్లో నివసించే వారికి మాత్రమే ఆయా సంప్రదాయాల ప్రకారం ఈ నియమాలు వర్తిస్తాయి.

ఏ రాశుల వారిపై ఎలాంటి ప్రభావం?

అరిష్ట ఫలితాలు ఎక్కువగా ఉన్న రాశులు: కర్కాటక, సింహ, మేష, ధనుస్సు, అనుకూల ఫలితాలు ఉన్న రాశులు: వృషభ, కన్య, తుల, కుంభ, మిగిలిన రాశులు (మిథున, వృశ్చిక, మకర, మీన): శుభాశుభ మిశ్రమ ఫలితాలు గోచరిస్తాయి. గమనిక: ఇవి సాధారణ గోచార ఫలితాలు మాత్రమే. వ్యక్తిగత ఫలితాలు జన్మకుండలి, దశా-భుక్తులు, గోచారాలు, గ్రహణ నక్షత్ర సంబంధం వంటి అంశాలపై ఆధారపడి ఉంటాయి.

గ్రహణ సమయంలో ఏం చేయాలి?

భారతదేశంలో గ్రహణం కనిపించకపోయినా ఆధ్యాత్మికంగా ఈ సమయంలో గాయత్రీ మంత్ర జపం, ఆదిత్య హృదయ పారాయణం, నవగ్రహ స్తోత్రం, విష్ణు సహస్రనామం, మహామృత్యుంజయ మంత్ర జపం చేయడం శ్రేయస్కరంగా భావిస్తారు.

మన బాల్కనీ నుంచి... విశ్వవీధుల్లో విహరిద్దాం

గ్రహణాన్ని వీక్షించే వారు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలివీ..

గ్రహణం కనిపించే దేశాల్లో ఉన్నవారు కళ్లతో నేరుగా సూర్యుడిని చూడరాదు. టెలిస్కోప్, బైనాక్యులర్ లేదా కెమెరాతో ప్రత్యేక సౌర ఫిల్టర్ లేకుండా చూడడం వల్ల శాశ్వత కంటి నష్టం కలిగే ప్రమాదం ఉంది. ఈసారి భారతదేశంలో గ్రహణం కనిపించనందున ప్రజలు ఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ఆషాఢ బహుళ అమావాస్యను తెలుగు ప్రాంతాల్లో చుక్కల అమావాస్యగా పిలుస్తారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణం, అన్నదానం, వస్త్రదానం, గోసేవ, బ్రాహ్మణ సంతర్పణ వంటి పుణ్యకార్యాలు చేయడం విశేష ఫలప్రదమని శాస్త్రాలు పేర్కొంటాయి. కొన్ని ప్రాంతాల్లో మహిళలు కుటుంబ క్షేమం, సంతానాభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

# చేయూత పింఛన్లకు 'సువర్ణావకాశం'

## అర్హులైన ఒక్కరూ తప్పిపోకూడదు

- వారం రోజుల్లో గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలి
- గ్రామం, వార్డు వారీగా పకడ్బందీగా సర్వే
- శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి): జిల్లాలో అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ విధానంలో గుర్తించి వారం రోజుల్లోగా ప్రక్రియను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో అర్హులను గుర్తించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన, పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీఆర్‌డీవో, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై ఆమె సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్నందున ఆయా వర్గాల్లోని అర్హులందరినీ గుర్తించాలని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను సవాలుగా తీసుకుని అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంతమంది పింఛన్లకు అర్హులవుతారో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఒంటరి మహిళలు జనన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వితంతువులు భర్త మరణ ధ్రువపత్రాన్ని, దివ్యాంగులు సదరం ధ్రువపత్రాన్ని సిద్ధంగా ఉంచుకుని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర సిబ్బంది సహకారంతో అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. పేదలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణ, సామాజిక అవగాహనతో

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

## విద్యతో పాటు సామాజిక అవగాహన అవసరం : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి బ్యూరో, ఆగస్టు 11 జనంసాక్షి : విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు విద్యపై ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి మండలంలోని అంజనగిరి గ్రామంలో విద్యార్థులతో కలిసి ఆయన కొంతసేపు గడిపారు. గతంలో 'సర్' కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించిన ఆయన.. పరిశుభ్రత, మంచినీరు, ఆహార నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఆ సందర్భంగా విద్యార్థులకు తాను స్వయంగా భోజనం తయారు చేయించి ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. విద్యార్థులతో కలిసి ఆప్యాయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాజీ మంత్రి స్వయంగా భోజనం వడ్డించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

### విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి విద్య పట్ల ఇష్టాన్ని పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజంలో నెలకొన్న పరిస్థితులపై అవగాహన కల్పించి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధికారులపై ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విద్యా సంస్థలను తరచుగా సందర్శించి విద్యా వసతులు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, భవిష్యత్తులో సమాజానికి బాధ్యతగల పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు.

### రైతుల గొప్పతనాన్ని వివరించిన మాజీ మంత్రి

భోజనం అనంతరం విద్యార్థినీ, విద్యార్థులను నిరంజన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులకు ఆహారాన్ని అందించడంలో రైతులు, రైతు కూలీల పాత్ర ఎంతో విశిష్టమైనదని వివరించారు. మనకు అన్నం అందించే రైతులను, రైతు కూలీలను గౌరవించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా గౌరవిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు ఉద్బోధించారు.అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, అరటి పండ్లు అందించి వారితో సరదాగా ముచ్చటించారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కె. మాణిక్యం, సర్పంచ్ నేనావత్ శాంతమ్మ దేవకుమార్, రఘువర్ధన్‌రెడ్డి, ధర్మానాయక్, రవిప్రకాష్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరేష్, చిట్యాల రాము, ఉపసర్పంచ్ రాజు, ధర్మేందర్, యాదగిరి, వాసు, తిరుపతయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.25 కోట్ల రోడ్డు.. రెండు నెలలకే బీటలు!



## కోటింపావు ప్రజాధనం బుగ్గిపాలు

- గంగన్నగూడ హై లెవెల్ బ్రిడ్జి సీసీ రోడ్డుపై పగుళ్లు
- నాణ్యతపై స్థానికుల ఆగ్రహం.. అధికారుల తీరుపై విమర్శలు
- ప్రజాధనం వృథా కాకుండా నాణ్యతపై విచారణ జరపాలని డిమాండ్
- కాంట్రాక్టర్‌తోనే మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి

కొందుర్గు, ఆగస్టు 11 (జనంసాక్షి): దశాబ్దాల ప్రజల కల.. కోట్ల రూపాయల ప్రజాధనం.. కేవలం రెండు నెలలకే పగుళ్లు తేలి కాంట్రాక్టర్ల, అధికారుల అవినీతికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. కొందుర్గు మండల కేంద్రం నుండి గంగన్నగూడా, చెరుకుపల్లి, విశ్వనాథ్‌పూర్, రావిర్యాల, ఎదిరా తదితర గ్రామాలకు వెళ్లే అత్యంత కీలకమైన ప్రధాన రహదారిపై నిర్మించిన గంగన్నగూడ హై లెవెల్ బ్రిడ్జి సీసీ రోడ్డు అప్పుడే బీటలు వారింది. హెచ్‌ఎండీఏ నిధులు రూ.1 కోటి 25 లక్షల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ రోడ్డు, ప్రారంభించిన రెండు నెలలకే ఈ స్థితికి చేరడంపై ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నరకం చూసిన గంగన్నగూడ ప్రాంత ప్రజల సమస్యను శాశ్వతంగా తీర్చామంటూ, ఇటీవల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు ఎంతో అట్టహాసంగా, సంబరాల మధ్య ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని 'క్రెడిట్' కోసం ఎగబడ్డ నేతలు, ఇప్పుడు రోడ్డు పగుళ్లు ఇస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజాప్రతినిధుల అతి ఉత్సాహం కేవలం ప్రారంభోత్సవాలకేనా, పనుల నాణ్యతను పరిశీలించడంలో లేదా? అని మండిపడుతున్నారు.

### కళ్లెదుటే నాణ్యత లోపం..అధికారుల గుడ్డి నిద్ర!


కోటింపావు ప్రజాధనం వెచ్చించిన పనుల్లో కాంట్రాక్టర్ల నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డు వేసే సమయంలో పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు పూర్తిగా కళ్లు మూసుకోవడం వల్లే ఈ ఘోరం దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు నెలలకే రోడ్డు ఇంతలా దెబ్బతింటే, ముున్ముందు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే బ్రిడ్జి భద్రత ఏంటని ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.కదిలిరావాల్సిన ఉన్నతాధికారులు.. అనేక గ్రామాలకు లైఫ్ లైన్ లాంటి ఈ ముఖ్యమైన బ్రిడ్జి రోడ్డుపై అప్పుడే పగుళ్లు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యత లోపానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కాంట్రాక్టర్‌తోనే ఉచితంగా వెంటనే మరమ్మతులు చేపట్టి నాణ్యమైన రోడ్డును అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

### ఏఈఈ మెహర్ తేజ

సిసి రోడ్డు మరమ్మత్తుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పనుల్లో నాణ్యత లోపించినా, ఆలస్యం చేసినా నిబంధనల ప్రకారం పనులు చేయకపోతే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులు ఆపేస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరలోనే మరమ్మతుల పనులను పూర్తి చేయిస్తాం.

### బ్రిడ్జి రోడ్డు కుంగుబాటుపై కలెక్టర్‌కు బీజేపీ ఫిర్యాదు

కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామంలోని హై లెవెల్ బ్రిడ్జికి అనుసంధానంగా నిర్మించిన సీసీ రోడ్డు కుంగిపోవడంపై బీజేపీ మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిర్మాణం పూర్తయి నెల రోజులు కూడా గడవకముందే రోడ్డు దెబ్బతినడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నాణ్యతలో లోపాలు ఉంటే భవిష్యత్తులో వాహనదారులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలను నిపుణులతో పరిశీలింపజేసి సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. నాణ్యతా లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులైన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంగిపోయిన రోడ్డును తక్షణమే తొలగించి, నాణ్యతా ప్రమాణాలతో పునర్నిర్మించాలని కోరారు. ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే బీజేపీ తరఫున ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని లక్ష్మీకాంతరెడ్డి హెచ్చరించారు.



# మెడికో విద్యార్థిని ప్రియాంకకు ఘన నివాళి

## చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి

### మృతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 11 (జనంసాక్షి): గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో మెడికో విద్యార్థిని డాక్టర్ కనికే ప్రియాంకకు మెడికల్ విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీపీఎఫ్ శంకర ప్రభాకర్, పీవైఎల్ బీరెల్లిదానయ్య మాట్లాడుతూ డాక్టర్ కనికే ప్రియాంక మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాల్సిన మెడికల్ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రియాంక మృతికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన వారిని గుర్తించి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేరం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను బలోపేతం చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. డాక్టర్ కనికే ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యార్థులు ఐక్యంగా పోరాడుతారని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్, నాగన్న, మణికంఠ, రాజశేఖర్, గుజ్జురాల్, విజయ్, భరత్, సాయికుమార్‌తో పాటు పలువురు మెడికో విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాయదుర్గం పరిధిలో మాదకద్రవ్యాల సరఫరా

## ఇద్దరి అరెస్ట్... మరో ఇద్దరి పరారీ

శేరిలింగంపల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాపై నార్సింగి ఎస్ఓటి పోలీసులు, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు రాయదుర్గం ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం... బీహార్ ప్రాంతానికి చెందిన రోషన్(30), అభిషేక్ కుమార్ (22) బ్రతుకుతెరువు నిమిత్తం నగరానికి వచ్చి కూలీలుగా స్థిరపడ్డారు. ఈ క్రమంలో గాంజాను సేవించడం అలవాటుగా మార్చుకొని పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే వ్యక్తుల నుండి కొనుగోలు చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఈ విషయంపై విశ్వసనీయ సమాచారం అందడంతో వారు నార్సింగి ఎస్ఓటి విభాగం పోలీసులకు సమాచారం అందించి రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి మధురానగర్ పోచమ్మ గుడి ప్రాంతంలో మదకద్రవ్యాల అమ్మకాలు కొనుగోలు జరుగుతున్నట్టు తెలుసుకొని వారు ముకుమ్మడిగా దాడి చేయడంతో బీహార్ వాసీలైన రోషన్, అభిషేక్‌లు పోలీసులకు పట్టుబడడం జరిగిందని పోలీసులు వివరించారు. అయితే మాదకద్రవ్యాల ప్రధాన సరఫరాదారులైన బంటి కుమార్, అమర్ కుమార్ పోలీసులను చూసి తప్పించుకొని పారిపోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుండి 2.8 కిలోల ఎండుగాంజా, 6 గ్రాముల హెరాయిన్ ను స్వాధీనం చేసుకొని మాదకద్రవ్యాల నిరోధక చట్టం పరిధిలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆసుపత్రిలో మందులు లేవు..

# పొదల్లో కుప్పలు!



## గద్వాల రైల్వేస్టేషన్ సమీపంలో ప్రభుత్వ మందుల నిల్వలు

- కాల్షియం మాత్రలు, కుటుంబ నియంత్రణ సాధనాలు బయటపడిన వైనం
- ప్రజాధనం వృథాపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజల విజ్ఞప్తి




జోగులాంబ గద్వాల ప్రతినిధి, జులై 11 (జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో లేవంటూ పేద రోగులను బయట మందుల దుకాణాలకు పంపుతున్న పరిస్థితుల్లో, ప్రభుత్వానికి చెందిన మందులు గద్వాల రైల్వేస్టేషన్ సమీపంలోని పొదల్లో పెద్దఎత్తున కనిపించడం కలకలం రేపింది. కాల్షియం, విటమిన్-డీ3 మాత్రలతో పాటు కుటుంబ నియంత్రణకు సంబంధించిన కాపర్-టి సాధనాలు అక్కడ పడేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రావాల్సిన మందులు ఇలా బహిరంగ ప్రదేశాల్లోకి ఎలా చేరాయన్న దానిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు. రోగులకు ఉచితంగా అందాల్సిన మందులు అందుబాటులో లేకపోవడం, మరోవైపు ప్రభుత్వ మందులు వినియోగించకుండా పడేయడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొదల్లో లభించిన మందుల ప్యాకేజీలపై తయారీదారు పేరు, బ్యాచ్ నంబరు, డ్రగ్ లైసెన్స్, గడువు తేదీ తదితర వివరాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వాటి ఆధారంగా ఏ ప్రభుత్వ స్టోర్ నుంచి మందులు సరఫరా అయ్యాయి? ఏ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు? ఎంత పరిమాణంలో పంపారు? వినియోగించకుండా మిగిలిన నిల్వలను ఎవరి ఆదేశాలతో తరలించారు? అన్న అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా కాల్షియం, విటమిన్-డీ3 మాత్రలు గర్భిణులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు అందాల్సినవి కాగా, కాపర్-టి వంటి కుటుంబ నియంత్రణ సాధనాలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. అలాంటి సామగ్రి బహిరంగ ప్రదేశంలో పడేయడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ఆధారపడే పేదలకు మందులు అందకుండా, మరోవైపు నిల్వలు వృథా కావడం బాధాకరమని అంటున్నారు. గతంలోనూ ప్రభుత్వ మందులు గడువు ముగిసి వృథా అయిన ఘటనలపై ఆడిట్ నివేదికల్లో ప్రస్తావనలు వచ్చిన నేపథ్యంలో గద్వాల ఘటనపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. అవసరానికి మించి మందులు కొనుగోలు చేశారా? నిల్వల నిర్వహణలో లోపం జరిగిందా? గడువు ముగిసే వరకు మందులను ఎందుకు వినియోగించలేదు? బహిరంగ ప్రదేశంలో ఎవరు పడేశారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ మందుల సరఫరా, నిల్వలు, పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తే వాటి మూలాలను గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. బ్యాచ్ నంబర్లు, సరఫరా వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని కోరుతున్నారు. కాలం చెల్లిన లేదా వినియోగానికి పనికిరాని మందులను నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేయాల్సి ఉండగా, బహిరంగ ప్రదేశంలో పడేయడం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో కేవలం కిందిస్థాయి సిబ్బందిపై చర్యలతో సరిపెట్టకుండా మందుల కొనుగోలు, నిల్వ, పంపిణీ వ్యవస్థలో ఎక్కడ లోపం జరిగిందో గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పేదలకు ఉచితంగా అందాల్సిన మందులు ఇలా వృథా కాకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వలు, గడువు తేదీలు, పంపిణీ విధానంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఘటనపై వైద్యాధికారులు వెంటనే స్పందించి, మందులు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఒకరే.. రెండుసార్లు

# చనిపోయినట్లు నమోదు!

- బొమ్మన్‌పల్లి పంచాయతీలో డెత్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు
- వేర్వేరు తేదీలతో ఒకే వ్యక్తికి ధ్రువపత్రాలు జారీ చేసినట్లు ఆరోపణ
- బర్త్, డెత్ రికార్డులపై సమగ్ర విచారణకు గ్రామస్థుల డిమాండ్
- ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



అచ్చంపేట, ఆగస్టు 11 (జనం సాక్షి): ఒక వ్యక్తి జీవితంలో ఒక్కసారే మరణిస్తాడు. మరణించిన వ్యక్తికి అధికారికంగా ఒక మరణ ధ్రువీకరణ పత్రం జారీ కావాలి. కానీ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చం పేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీలో ఇందుకు భిన్నంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే వ్యక్తి వేర్వేరు తేదీల్లో మరణించినట్లు రికార్డుల్లో నమోదు చేసి, వేర్వేరు డెత్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పత్రాల ఆధారంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఒకే వ్యక్తికి భిన్నమైన మరణ తేదీలతో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు గ్రామంలో మరికొంతమందికి కూడా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ధ్రువీకరణ పత్రం జారీకి పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు కూడా స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

### ఒకే వ్యక్తికి రెండు డెత్ సర్టిఫికెట్లు

**జల్లెల గోపయ్య:**

2023 డిసెంబర్ 10న మరణించినట్లు, అదే నెల 15న రిజిస్ట్రేషన్ నంబర్ 90తో నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ CDMA022615403517 జారీ చేసినట్లు వివరాలు ఉన్నాయి. ఇదే వ్యక్తి 2023 నవంబర్ 15న మరణించినట్లు 2025 మార్చి 3న రిజిస్ట్రేషన్ నంబర్ 07తో మరోసారి నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ CDMA022615403488 జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రాగుల బక్కమ్మ:**

2021 జనవరి 16న మరణించినట్లు 2021 జనవరి 17న రిజిస్ట్రేషన్ నంబర్ 2తో నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ CDMA022615413627 ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. అదే వ్యక్తి 2024 అక్టోబర్ 27న మరణించినట్లు 2024 డిసెంబర్ 24న రిజిస్ట్రేషన్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు పంచాయతీ కార్యదర్శి తన ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తూ ఎన్ని సర్టిఫికెట్లు అయినా ఇస్తున్నాను గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు ఉన్నత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు



- రద్దయ్యే జాబితాలో 12,97,593 ఓట్లు
- జూన్ 25న సర్ ప్రక్రియ ప్రారంభం
- రెండుసార్లు గడువు పొడిగించిన ఈసీ
- ఈ నెల 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్
- షరతులతో మరో అవకాశం
- మరింత తగ్గనున్న బోగస్ ఓట్లు

# రంగారెడ్డి ఓటర్లు.. 24,02,146?

## పూర్తయిన డిజిటలైజేషన్



**రంగారెడ్డి, ఆగస్టు 11 (జనంసాక్షి) :**

*రంగారెడ్డి జిల్లాలో ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయింది. భారీగా బోగస్ హోటల్ రా ఏరువేత పూర్తయింది. సుమారు 12 లక్షల 97,593 ఓట్లు రద్దయ్యాయి. ఇక జిల్లాలో 24,02,146ఓట్లు మాత్రమే మిగిలాయి. అయితే అనుకున్నంత మేర హోటల్ డిజిటల్టైజేషన్ పూర్తి కాకపోవడంతో జిల్లా యంత్రాంగం షరతులతో కూడిన మరో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోం ది. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మొత్తం 36 లక్షల 99,743 ఓట్లు కలిగి ఉన్నారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాదు నగర శివారులో మిలతమై ఉండడంతో భారీగా డబల్ ఓట్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇటు గ్రామాల్లో అటు పట్టణాల్లో డబల్ ఓట్లు కదిగిన వాటిని తొలగించే ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇంకా అక్కడక్కడ కొంతమంది తమ ఓటును డిజిటలైజేషన్ చేసుకోకపోవడంతో వారికి మరో ఛాన్స్ ఇవ్వనున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఏఫ్) సమర్పించని ఓట్లపై ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీంతో వీరంతా జాబితాలో ఉన్నారా.. లేదా? అనే సందిగ్ధం ప్రస్తుతం నెలకొన్నది.*

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సోమవారంతో ముగిసింది. ఈనెల 10వ తేదీ వరకు ఉన్న సమాచారం ప్రకారం పరిశీలిస్తే.. రంగారెడ్డి జిల్లాలో 12.97 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరన్ ఫారాలు (ఈఏఫ్) ఇంకా డిజిటలైజ్ కాలేదు. దీంతో వీరంతా జాబితాలో ఉన్నారా.. లేదా? అనే సందిగ్ధం ప్రస్తుతం నెలకొన్నది. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌కు ఎన్నికల సంఘం విధించిన గడువు సోమవారంతో ముగిసింది. ఈసీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న బీఎల్‌వోలు చివరి నిముషం వరకు.. ఈఏఫ్‌లు డిజిటలైజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కాగా, ఈనెల 17న డ్రాఫ్ట్ జాబితా విడుదలతో పూర్తి స్పష్టత వచ్చే అవకాశమున్నది.

**డిజిటలైజేషన్ కానీ 12,97,593 ఓట్లు..**

డిజిటలైజ్ కాని 12,97,593 మంది ఓటర్లు ఓటరు జాబితాలో కొనసాగుతారా..? లేక డ్రాఫ్ట్ జాబితా నుంచి వారి పేర్లు తొలగుతాయా..? అన్నది ఈ నెల 17న వెలువడే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాతో తేలే అవకాశమున్నది. డ్రాఫ్ట్ జాబితాలో పేర్లు లేకపోతే సంబంధిత ఓటర్లకు క్లెయిమ్స్, అభ్యంతరాల దశలో తమ వివరాలను సరిచేసుకునే అవకాశం ఉంటుందా.. లేదా..? అన్నది అధికారులు స్పష్టంగా తెలుపాల్సిన అవసరమున్నది. మరోవైపు డిజిటలైజ్ కాని ఓటర్లలో ఎంతమంది వాస్తవంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు? ఎంతమంది మరణించారు? ఎంతమంది అందుబాటులో లేరు? ఎంతమంది ఫారాలు సమర్పించలేదు? వంటి వివరాలు కూడా తర్వాత దశలో వెల్లడయ్యే అవకాశమున్నది. మొత్తం మీద ఈ 12,97,593 మంది ఓటర్లు ఉన్నట్టా..? లేనట్టా..? అన్న ప్రశ్నకు ఈ నెల 17న ఓటర్ల డ్రాఫ్టు పబ్లికేషన్ ద్వారా స్పష్టత రానున్నది. అలాగే ఏవైనా అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 16వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అభ్యంతరాలు క్లెయిమ్స్, డిస్పోజల్స్ ఈ నెల17 నుంచి 15 అక్టోబర్ వరకు చేస్తారు. 19న ఫైనల్ జాబితాను ప్రకటిస్తారని ఎన్నికల సంఘం ప్రకటించింది.

**నియోజకవర్గాల వారిగా..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 344,584 ఓట్లు ఉండగా వీటిలో ఇప్పటివరకు 2,58,098 ఓట్లు డిజిటల్ చేశారు. మరో 86,486 ఓట్లు డిజిటల్ కావాల్సి ఉంది. ఎల్బీనగర్లో 608,203 ఓట్లకు గాను 3,35,296 డిజిటలైజేషన్ చేశారు. మరో 2,72,907 ఓట్లు డిజిటల్ కావాల్సి ఉంది. మహేశ్వరంలో 5,74,637 ఓట్లకు గాను 3,37,221 ఓట్లు ఆన్లైన్ చేశారు. ఇక్కడ 2,37,416 ఓట్లు డిజిటల్ కావాల్సి ఉంది. రాజేంద్రనగర్లో 6,35,283 మందికు గాను 3,86,505 రోడ్లు మాత్రమే డిజిటల్ చేశారు. ఇక్కడ 248,778 ఓట్లు ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ చేయాల్సి ఉంది. శేరిలింగంపల్లిలో 7,73,372 ఓట్లు ఉండగా 4,41,115 డిజిటలైజేషన్ చేశారు. ఇక్కడ 3,32,257 అత్యధికంగా డిజిటలైజేషన్కు దూరంగా ఉన్నాయి. చేవెళ్ల నియోజకవర్గం లో 2,73,883 ఓట్లకు గాను 2,18,163 మాత్రమే డిజిటల్ చేశారు. ఇక్కడ 55,720 ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ కావాల్సి ఉంది. కల్వకుర్తి నియోజకవర్గం లో 2,45,355 ఓట్లకు గాను 2,16,826 ఓట్లు మాత్రమే డిజిటలైజేషన్ చేశారు. ఇంకా 28,529 ఓట్లు డిజిటల్ కావాల్సి ఉంది. ఇంకా షాద్నగర్ నియోజకవర్గంలో 2,44,426 ఓట్లకు గాను 2,08,922 డిజిటలైజేషన్ అయ్యాయి. ఇక్కడ 35,504 ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ కావాల్సి ఉంది.

# కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలి

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో దొంగ డ్రామాలు చేస్తున్నారంటూ విమర్శ
- ఎమ్మెల్సీ, విప్‌గా ఉన్నప్పుడు ఇళ్లు ఎందుకు పంచలేదో చెప్పాలి
- ప్రభుత్వ కార్యక్రమాల్లో వ్యవహరించిన తీరు సిగ్గుచేటు
- హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని వొడితల ప్రణవ్



**జమ్మికుంట, ఆగస్టు 11 (జనంసాక్షి):** హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ నిధులు తీసుకొచ్చేందుకు తాము కృషి చేస్తున్నామని, అయితే వచ్చిన మంత్రుల ఎదుట ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరు నియోజకవర్గం పరువు తీసేలా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ విమర్శించారు. కౌశిక్‌రెడ్డి తన పద్ధతిని మార్చుకోకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని అన్నారు. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో కౌశిక్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుమారు రెండున్నరేళ్లు ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా పదవిలో ఉన్న సమయంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎందుకు పంపిణీ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2017లో నిర్మాణాలు ప్రారంభించి సగంలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ఇన్‌చార్జి మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులకు గృహప్రవేశాలు జరుగుతుండటాన్ని కౌశిక్‌రెడ్డి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా అధికారంలో ఉన్న సమయంలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుంటే వాటిని అడ్డుకోవడం సరికాదన్నారు. అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తే అవే నిజాలవుతాయనే భ్రమలో కౌశిక్‌రెడ్డి ఉన్నారని, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధిగా హుందాగా వ్యవహరించాల్సిన వ్యక్తి అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కౌశిక్‌రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై కూడా చూపించాలని అన్నారు. ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి పూర్తిస్థాయిలో విఫలమయ్యారని ప్రణవ్ విమర్శించారు. హుజురాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. ఇటీవల పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు జమ్మికుంట, హుజురాబాద్, బుజునూర్ గ్రామాల్లో నిర్మించిన ఇళ్లకు అవసరమైన నిధులు కేటాయించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు పరశురాం, పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ స్వప్న-సదానందం, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, డైరెక్టర్లు, మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, మహిళా నాయకురాళ్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోకట్‌లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరూ వ్యక్తుల మృతి

- కల్తీ కల్లు మద్యం తాగినట్లు అనుమానం
- మద్యం బాటిల్స్ కల్తీకల్లు పాకెట్లు స్వాధీనం
- కల్లులో ఏమైనా విష ప్రయోగం జరిగిందని అనుమానం
- పోస్టుమార్టం కోసం తాండూర్ ఆసుపత్రికి తరలింపు
- కేసు నమోదు చేసిన యాలాలు పోలీసులు



వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 11 (జనం సాక్షి) : అప్పటివరకు బాగానే ఉన్నారు. అంతలోనే విగతగా పడి ఉన్నారు. అనుమానాస్పద స్థితిలో మామ అల్లుడు మృతి చెందిన సంఘటన ఈ యాలాల మండలం కోకట్ లో జరిగింది. బాధ్యత బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి కోకట్ గ్రామానికి చెందిన ల్యాకత్ గోరెప్ప అనే ఇద్దరు వ్యక్తులు సోమవారం రాత్రి అనుమానస్పరస్థితిలో మృతి చెందారు. వీరిద్దరూ వరుసకు మామ అల్లుళ్లు. సోమవారం రాత్రి ఒక నాపరాతి పరిశ్రమలో విందుకు హాజరై ఇంటికి చేరుకున్నారు. ఉదయం చూసేసరికి ఇంట్లో మామ అల్లుడు మృతి చెంది విగతగా పడి ఉన్నారు. ఇరుగుపొరుగువారు గమనించి యాలాల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంట్లో ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం కల్లు తాగినట్లు పోలీసులు గుర్తించారు. వీరు మృతి చెందిన ఇంట్లో 3 కల్లు గ్లాసులు నిండి ఉన్నాయి. వీటితోపాటు కల్లు పాకెట్లు మద్యం బాటిల్ ను పోలీసులు గుర్తించారు. ఇద్దరి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. దీంతో కల్తీ కల్లు లేదా కల్తీ మద్యం తాగి చనిపోయి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లో తాగినప్పుడు మూడు గ్లాసులు దొరికిన కారణంగా మూడో వ్యక్తి ఎవరనే విషయమై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కల్లు మద్యం లో ఏమైనా విష ప్రయోగం జరిగిందనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తులకు ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున కూతుర్లు ఉన్నారు. వీరి భార్యలు ఒకరు పుట్టింటికి వెళ్ళగా అత్త మృతి చెందడంతో నిద్ర చేయడానికి మరొకరు బంధువుల ఇంటికి వెళ్ళింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. గత పది రోజుల క్రితమే ల్యాఖత్ తల్లి బిస్మిల్లా మృతి చెందింది. దీంతో పది రోజుల్లోనే ఒకే ఇంట్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలను కోకట్ గ్రామంలో నిర్వహించారు. పోలీస్ దర్యాప్తు జరుగుతుంది. పోస్టుమార్టం అనంతరం నిజా నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## చేయూత పింఛన్‌కు
# ఈ నెల 31 వరకు గడువు

- అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు
- దరఖాస్తుల పరిశీలన, డేటా నమోదులో అప్రమత్తత అవసరం
- మండల స్థాయిలోనే ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

**ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి**



**వికారాబాద్ జిల్లా బ్యూరో, (జనం సాక్షి):** జిల్లాలో చేయూత పింఛన్ పథకానికి అర్హులైన వారిని గుర్తించి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను స్వీకరించి, నిర్దేశిత విధానంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఈలు, ఏఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31 వరకు స్వీకరించాలని, నిర్దేశిత మాడ్యూల్ ప్రకారం పరిశీలన చేపట్టాలని సూచించారు. దరఖాస్తుల డేటా నమోదులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ అధికారి ఏ లాగిన్‌లో డేటా నమోదు చేశారన్న వివరాలు నమోదవుతు న్నందున తొందరపాటుతో తప్పుల డేటా నమోదు చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తొలి విడతలో పాఠశాలలకు అందించాల్సిన యూనిఫారాలను ఆయా పాఠశాలల్లో పంపిణీ చేయాలని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచిం చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రాట్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యానికి టాప్‌రా డిమాండ్
- కొత్త ఫార్ములాతో రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం
- ఫామ్-ఎల్ దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**హయత్‌నగర్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** టీజీఎస్‌ఆర్టీసీలో 2017లో గ్రాట్యుటీకి సంబంధించి కొత్త ఫార్ములాతో సర్క్యులర్ జారీ చేసి, 2018 నుంచి అమలు చేయడం వల్ల దీర్ఘకాలం సర్వీసు చేసిన రిటైర్డ్ ఉద్యోగులు నష్టపోయారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్‌రా) తెలంగాణ కమిటీ ఆరోపించింది. 35 నుంచి 40 సంవత్సరాల వరకు సర్వీసు చేసిన పలువురు ఉద్యోగులు గ్రాట్యుటీ రూపంలో లక్షలాది రూపాయలు కోల్పోయారని పేర్కొంది. 2018 నుంచి 2025 ఆగస్టు వరకు కొత్త గ్రాట్యుటీ ఫార్ములాను అమలు చేసినట్లు కమిటీ తెలిపింది. ఈ ఫార్ములా ప్రకారం రిటైర్ అయిన ఉద్యోగులు తమకు రావాల్సిన గ్రాట్యుటీకి సంబంధించి డిపో లేదా యూనిట్ కార్యాలయాల్లో ఫామ్-ఎల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సంబంధిత కార్యాలయ సిబ్బంది స్పందించడం లేదని ఆరోపించింది. రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా పెండింగ్‌లో ఉన్న ఫామ్-ఎల్ దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకుని, వారికి రావాల్సిన గ్రాట్యుటీ మొత్తాన్ని చెల్లించాలని టాప్‌రా తెలంగాణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమస్యపై టీజీఎస్‌ఆర్టీసీ హెడ్ ఆఫీస్‌లోని చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు ఆర్టీఐ చట్టం ద్వారా నోటీసు పంపించనున్నట్లు టాప్‌రా తెలంగాణ కమిటీ వెల్లడించింది. రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు టాప్‌రా హయత్‌నగర్-1, హయత్‌నగర్-2 డిపోల కమిటీ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, కార్యదర్శి పప్పు సత్యనారాయణ గౌడ్, అశోక్, శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

**ఘట్కేసర్ (పోచారం), ఆగస్టు 11 ( జనం సాక్షి ):** పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, సీసీఎస్ ఉప్పల్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 73 గ్రాముల బంగారు ఆభరణాలు, 150 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లు, రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ సాహుల్ (29), కుంచాల గురు ప్రసాద్ (29) నిందితులుగా గుర్తించారు. ఈ నెల 2న గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఉదయం వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లగా, మధ్యాహ్నం అతని భార్య కూడా ఇంటికి తాళం వేసి పొరుగింటికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన తలుపు, గేటు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోని అల్మారాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. యమ్మనంపేట గ్రామం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించి, ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదును అపహరించేవారని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు షేక్ సాహుల్‌పై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 47 క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తాళం వేసి ఇళ్లను వదిలి వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు సక్రమంగా లాక్ చేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదును ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112కు సమాచారం అందించాలని కోరారు.

# పెరిగిన ధరల ప్రకారమే పరిహారం ఇవ్వాలి

## మొండి గౌరేల్లిలో రైతుల ఏకగ్రీవ తీర్మానం



**యాచారం, ఆగస్టు 11(జనంసాక్షి) :** ప్రభుత్వం సేకరించ తలపెట్టిన భూముల కు సంబంధించి యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ ప్రజలు, రైతులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూసేకరణ వల్ల రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా త్వరలోనే స్థానిక ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బాధితులు పలు ప్రధాన డిమాండ్లను తెరపైకి తెచ్చారు. పెరిగిన మార్కెట్ విలువల ప్రకారం రైతులకు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రికార్డుల ప్రకారమే కాకుండా, ప్రస్తుతం రైతుల కబ్జాలో ఉన్న పూర్తి విస్తీర్ణానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గతంలో స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చిన అదనపు ప్లాటు విషయమై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని నిలదీశారు. వివాదాస్పదంగా మారిన 19, 68, 127, మూడు సర్వే నెంబర్లకు విడివిడిగా కాకుండా, ఒకేసారి అవార్డు పాస్ చేసి పరిహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ మహాసభలో గ్రామానికి చెందిన ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ఆయా సర్వే నెంబర్ల పరిధిలోని బాధిత రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు.

# మంజూరైన పనులు వెంటనే చేపట్టాలి

## పెండింగ్ పనులకు వేగం పెంచాలి

- రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- కొత్త అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి
- అధికారులతో సమన్వయంతో పనులు పూర్తి చేయాలి



**ఉప్పల్, ఆగస్టు 11 (జనం సాక్షి):** రామంతాపూర్ డివిజన్‌లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రామంతాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనప్పటికీ కొన్ని పనులు ఇంకా ప్రారంభం కాకుండా పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తతో ఎమ్మెల్యే సమావేశమై డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇప్పటికే మంజూరైన పనుల వివరాలను అధికారులతో సమీక్షించిన ఆయన, నిధులు మంజూరైన తర్వాత కూడా పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగితే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందడంలో ఆలస్యం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రారంభించిన పనులు మధ్యలో నిలిచిపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. రామంతాపూర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, మురుగు కాలువలు, అంతర్గత రహదారులు తదితర సమస్యలపై కూడా ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన పనులతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి పనులకు కూడా అవసరమైన నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తను ఎమ్మెల్యే కోరారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అత్యవసర పనులకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రామంతాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంజూరైన పనులు ఏ దశలో ఉన్నాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట అధికారులతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. రామంతాపూర్ డివిజన్ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పంచవటి కాలనీ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

**రాజేంద్రనగర్, ఆగస్టు11(జనం సాక్షి) :** పంచవటి కాలనీలో జోనల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు సీతారాం దులిపాల శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ ను కలిసి కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను వివరించారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ఓయు కాలనీ, లాంకో సర్కిల్ రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, బాక్స్ డ్రెయిన్-కమ్-రోడ్డు ప్రారంభం, కాలనీ హద్దుల పరిరక్షణ తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పంచవటి కాలనీ ప్రవేశద్వారం వద్ద సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిని ఆక్రమణలు, అనధికార వినియోగం నుంచి కాపాడాలని కోరారు. మౌలిక వసతులు మెరుగుపరిచిన తర్వాతే కొత్త వాణిజ్య సంస్థలకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు, బీఆర్ఎస్ నాయకుడు సీతారాం దులిపాల ప్రస్తావించిన సమస్యలను పరిశీలించిన జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

Happy Anniversary

# జనంసాక్షి 16వ వార్షికోత్సవం

ప్రత్యేక అనుబంధం

12

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
12 ఆగస్టు 2026


# అమ్మవారికి మంత్రి సురేఖ మారుబోనం

- ఉజ్జయిని మహాంకాళిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) :** ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారు బోనం సమర్పణ కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. బోనమెత్తిన మహిళలకు ఈ సందర్భంగా మంత్రి సురేఖ చీరె, సారె అందజేశారు. సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని మంత్రి సురేఖ అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆషాఢ బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహలతో జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.



## సిఎం విజయ్‌కు ఎంపీ కమలహాసన్ అభినందన

**చెన్నై, ఆగస్ట్11 (జనంసాక్షి) :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభ ఆమోదించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ ఖాతాలో మంగళవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభలో ఆమోదించడం సంతోషకరం. ఇది కచ్చితంగా స్వాగతించదగినది. రాష్ట్ర హక్కులను వదులుకోని ఈ విధానం ఇలాగే కొనసాగాలి' అని రాసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయమైన 'వందేమాతరం'ను మొదటగా ఆలపించాలని, ఆ తర్వాతే ఇతర గీతాలను ఆలపించాలని కేంద్ర హోంశాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు అంతర్గత మార్గదర్శకాలను, సూచనలను జారీ చేసింది.




# ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

- సైనిక విమానంలో ట్రంప్ రహస్య ప్రయాణం
- 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనం

**వాషింగ్టన్, ఆగస్ట్11 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కాకుండా మరో సైనిక విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే.. టర్కీ రాజధాని అంకారాలో నాటో సదస్సు ముగిశాక ట్రంప్.. కెమెరాల ముందు పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కారు. అయితే ఆ తర్వాత ఆయనను ఒక ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు ద్వారా రహస్యంగా మరోచోట ఉన్న చిన్న సైనిక విమానం (ఎయిర్‌ఫోర్స్ సి-32ఏ) వద్దకు తరలించారు. ఆ విమానంలోనే ఆయన బ్రిటన్‌కు చేరుకున్నారని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు అందరూ భావించిన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం కూడా కొన్ని నిమిషాల తేడాతో అక్కడికి చేరుకుంది. పాత జ్ఞాపకాల కోసం ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేసినప్పటికీ అసలు కారణం ఇరాన్ నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పేనని స్పష్టమవుతోంది. ఈ కథనంపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. 'అధ్యక్షుడిపై అమెరికా శత్రువులు కన్నేశారు. వారి నుంచి రక్షణ కల్పించడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం' అని కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవ్ చుంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ రహస్య ప్రయాణంపై పెంటగన్ ఇంకా స్పందించలేదు.





## గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

- నటుడు ప్రకాశ్ రాజ్ సెల్ఫీ వీడియో



**బెంగళూరు, ఆగస్ట్11 (జనంసాక్షి) :** బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు.






















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370